ANN తెలుగు

Follow: @ANNTELUGU

06-12-2024

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 05 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


ఫైరింగ్

## కేసీఆర్‌ను మించి కేటీఆర్ బూతులు

- మీ తప్పులు ఎత్తిచూపితే తలలు ఎక్కడ పెట్టుకుంటారు
- కొండా సురేఖ ఫైర్



02

వెయిటింగ్

## చరిత్రకు అడుగు దూరంలో కోహ్లీ

- బోర్డర్-గవాస్కర్‌లో అత్యధిక సెంచరీలు చేసిన సచిన్
- అడిలైడ్ టెస్ట్‌లో కోహ్లీ మూడంకెల స్కోరును చేరుకుంటే సచిన్ రికార్డు బ్రేక్




05

వార్నింగ్

## హీరో అల్లు అర్జున్‌పై కేసు నమోదు

- సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో మహిళ మృతి
- సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంష్ యాదవ్



03



## ఈసారైనా సారొస్తారా..?

### రా రమ్మంటున్న రేవంత్

### అనుభవం పంచమంటూ ఆహ్వానాలు

ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేసీఆర్ రాకకు సంబంధించి భారీగా చర్చ జరుగుతుంది. ఈసారైనా కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా..? లేదా? అనే అంశంపై అటు నేతల్లో, అటు ప్రజల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఓటమితో సుమారుగా ఏడాది నుంచి ప్రజాక్షేత్రానికి దూరంగా ఉన్న కేసీఆర్ ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారా లేదా? అనేదానిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

వివరాలు 4లో



మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్

## ప్రమాణ స్వీకారం

- డిప్యూటీ సీఎంలుగా షిండే, పవార్
- ప్రమాణ స్వీకారానికి హాజరైన నరేంద్ర మోడీ, అమిత్ షా

**ముంబై, మహా :** మహారాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. దేవేంద్ర ఫడ్నవీస్ సీఎంగా ప్రమాణం చేయడం ఇది మూడోసారి. అనంతరం శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. ముంబయి ఆజాద్ మైదాన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా,

మిగతా 2లో

# 25 లక్షల ఇండ్లు నిర్మిస్తాం




## ఐదేళ్లలో గూటికలలు నెరవేరుస్తాం

- వాళ్ళు ఫాం హౌస్ లు కట్టుకుని పేదల ఇండ్లు మరిచారు
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్, కిషన్ రెడ్డిని పిలుస్తాం
- తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం
- ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ ఆవిష్కరణ లో సీఎం రేవంత్ రెడ్డి
- డిప్యూటీ సీఎం భట్టి,మంత్రి పొంగులేటితో కలిసి యాప్ ఆవిష్కరణ
- మూడు రోజుల పాటు కన్నుల పండుగగా విజయోత్సవాలు

రాష్ట్రంలో చరిత్రలో ఎవరూ నిర్మించని విధంగా ఐదేళ్ళలో పాతికలక్షల ఇళ్ళు నిర్మించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మ గౌరవాన్ని ఇందిరా గాంధీ కల్పించారని కొనియాడారు. ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలని, ఆ కల నెరవేరాలనే ఇందిరా గాంధీ ఇళ్లు నిర్మించి ఇచ్చారని సీఎం తెలిపారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో కానీ ఇందిరమ్మ కాలనీ లేని ఊరు ఈ దేశంలోనే లేదని చెప్పగలనని సీఎం అన్నారు. కూడు.. గూడు.. గుడ్డ... నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని, ఇళ్ల నిర్మాణం చేపట్టారని సీఎం తెలిపారు. - మహా, హైదరాబాద్

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,780 |
| 22 క్యారెట్ | 71,300 |
| సిల్వర్ (కేజీ) | 91,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 80,956.33 |
| నిఫ్టీ | 24,467.45 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 6.20 | 186 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 6.20 | 186 |
| రిటైల్ గుడ్డు ధర | 6.57 | 197.16 |

## సోయం బాపూరావు, ఆత్రం సక్కు కాంగ్రెస్‌లోకి

### బీజేపీ, బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

- ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఆపరేషన్.. గిరిజన నేతల రేవంత్ బాట
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్దంగా ఉన్నారు- టీపీసీసీ చీఫ్
- అడ్డమైన బాష మాట్లాడుతాం.. అధికారులను తిడుతామంటే చట్టం ఊరుకోదు
- రేవంత్ రెడ్డి నా అభిమాన నాయకుడు- సోయం బాపూరావు




**హైదరాబాద్, మహా:**
తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు షాక్ ఇచ్చారు ఆ పార్టీ నేతలు. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు కీలక నేతలు గురువారం నాడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నేత, మాజీ ఎంపీ సోయం బాబురావు, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. వీరికి పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. చేరికల అంశంపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరుతామంటూ సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు. శుభ ముహూర్తం చూసుకుని కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వస్తారని మహేష్ గౌడ్ చెప్పారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ పాలనకు పాస్ మార్కులు

### రేవంత్‌కు ఐదేళ్ళు ఢోకా లేదు

- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. ఏడాదిలో పెరిగిన కాంగ్రెస్ బలం
- కాంగ్రెస్ పాలనపై 53శాతం మంది సంతృప్తి
- జీతాలు, పెన్షన్లు సకాలంలో వస్తున్నాయని 73శాతం మంది సంతృప్తి
- రేవంత్ మాటకారి.. ఆయన స్పీచ్ లకు అభిమానులున్నారు
- కేసీఆర్ ఫాంహౌజ్ దాటకపోవడం మంచిది కాదు
- అధికారం లేకుండా ఆగలేకపోతుంది బీఆర్ఎస్
- కేసీఆర్ చేసిన రచ్చ సరిచేయాలంటే ఖచ్చితంగా టైం పడతది
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలలో కొన్నే అమలు.. ఏడాదిపాలనపై తాజా సర్వే

05





# హైడ్రామా

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్


### గచ్చిబౌలి ఠాణాలో పది గంటలు హరీష్ నిర్బంధం

- స్టేషన్ ముందు ఎమ్మెల్యేలు పల్లా, బీఆర్ఎస్ నేతలపై తదితరులపై లాఠీఛార్జి
- హరీష్, కౌశిక్ లకు కవిత, సబిత, సునితతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పరామర్శ
- బంజారాహిల్స్ పీఎస్ ముందు ఎర్రబెల్లి ఆందోళన
- ఉదయం నుండి సాయంత్రం దాకా.. అటు గచ్చిబౌలి... ఇటు బంజారాహిల్స్ ఠాణాల వద్ద ఉద్రిక్తత
- ఎఫ్ఐఆర్ లు గాంధీభవన్ నుండే–హరీష్ సంచలన ఆరోపణలు

02



# సోయం బాపూరావు, ఆత్రం సక్కు కాంగ్రెస్‌లోకి



(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకం అని చెప్పిన ఆయన.. కేసీఆర్ ప్రభుత్వం చేసిన ఫిరాయింపులకు, ఇప్పటి ఫిరాయింపులకు తేడా ఉందన్నారు. నాడు కేసీఆర్‌కి పూర్తి మెజార్టీ ఇచ్చినా ఫిరాయింపులు చేశారని విమర్శించారు. ప్రభుత్వాన్ని పడగొడుతాం అంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వచ్చారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలన పట్ల ఆకర్షితులవుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఇదే సమయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావు అరెస్ట్‌పై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే కుదరని చెప్పారు. తాము ఎన్నో సార్లు గృహ నిర్బంధాలకు గురయ్యామన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో నిర్బంధం ఎలా ఉండేదో హరీష్ రావు గుర్తు చేసుకోవాలని సూచించారు. అడ్డమైన బాష మాట్లాడుతాం.. అధికారులను తిడుతామంటే చట్టం తన పని తాను చేసుకొని పోతుందన్నారాయన. నిరసన తెలిపే హక్కును అడ్డుకోబోమన్నారు. హరీష్ రావు నానాయాగీ చేయాల్సిన అవసరం ఏముందని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ ఇప్పటికైనా ఆ పార్టీ అల్లరి మూకలను కంట్రోల్ చేయాలని హితవు చెప్పారు. లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

## రేవంత్ రెడ్డి నా అభిమాన నాయకుడు- సోయం బాపూరావు

ఈ సందర్భంగా సోయం బాబురావు మాట్లాడుతూ కీలక కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి తన అభిమాన నాయకుడు అని చెప్పారు. పదేళ్లలో పరిష్కారం కాని సమస్యలన్నింటినీ రేవంత్ రెడ్డి పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీపై తాను చేసిన విమర్శలకు చింతిస్తున్నానని బాబురావు ప్రకటించారు. ఇక ఆత్రం సక్కు మాట్లాడుతూ.. ఆదివాసీల సంరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. మైదాన ప్రాంతంతో పాటు.. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని, అందుకే పార్టీలోకి చేరుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను గడపగడపకి తీసుకెళ్తానని చెప్పారు.

### మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్
# ప్రమాణ స్వీకారం



(మొదటి పేజీ తరువాయి)
కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు తదితర ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నేతలతోపాటు బాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు.

**అభినందించిన మోడీ**

నూతన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ను ప్రధాని అభినందించారు.

**మా వారి బాధ్యత పెరిగింది**

దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఆయన భార్య అమృత ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడారు. సీఎంగా ఆయనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. 'ఫడ్నవీస్ ఆరోసారి ఎమ్మెల్యే అయ్యారు. మూడోసారి సీఎం కానున్నారు ఈ విషయంలో ఆనందం కన్నా, ఆయనపై పెద్ద బాధ్యత ఉందనే భావన కలుగుతోంది' అని అమృత పేర్కొన్నారు. కాగా, ఫడ్నవీస్ 2014లో తొలిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2014 నుంచి 2019 వరకు సీఎంగా వ్యవహరించారు. ఇక 2019లో రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా 3 రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది. తాజాగా ఆయన మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు.

**భారీ విజయం**

ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం దక్కించుకుంది. 288 అసెంబ్లీ స్థానాలకుగానూ మహాయుతి కూటమి మొత్తంగా 230 సీట్లు సొంతం చేసుకుంది. అందులో బీజేపీ 132 స్థానాల్లో విజయం సాధించగా, శివసేన 57, ఎన్సీపీ 41 సీట్లు గెలుపొందాయి.

### యూపీఎస్సీతో
# సమానంగా టీజీపీఎస్సీ

- స్వేచ్ఛగా పని చేస్తాం
- బాధ్యతలు స్వీకరించిన బుర్రా వెంకటేశం



**హైదరాబాద్, మహా :** యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని, కమిషన్‌పై పూర్తి విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తామని నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. ఇవాళ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషన్ సభ్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎడ్యుకేషన్‌లో ఉన్న సమయంలో 60 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ప్రణాళికా బద్ధంగా ప్రతి పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాస భరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్‌ను వదులుకుని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలని, టీజీపీఎస్సీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా అంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషన్‌కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ కూడా కేటాయిస్తామని ప్రకటించారు. టీజీపీఎస్సీకి స్వయం ప్రతిపత్తి ఉందని, దీంతో ఎవరికీ భయపడకుండా పని చేస్తామని ఉద్ఘాటించారు. ఎవరు తప్పులు చేసినా ఉపేక్షించమన్నారు. విద్యాశాఖలో ఉండటం వల్ల ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూస్తామని తెలిపారు. ఈ పదవిలోకి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాను కూడా ప్రిపేర్ అయ్యే సమయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ కరెక్ట్‌గా పనిచేయడంతోనే తనకు ఉద్యోగం వచ్చిందని గుర్తు చేసుకున్నారు. టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం 2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నారు. ఐఏఎస్‌కు బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ, గవర్నర్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా, జేఎన్‌టీయూహెచ్ వీసీగా బుర్రా వెంకటేశం రిలీవ్ అయ్యారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో
# మధ్యాహ్న భోజనం

**పోషకాలతో కూడిన భోజనం వడ్డించాలని హైకోర్టు ఆదేశం**

గుడ్డు కూడా ఇవ్వడం లేదన్న పిటిషనర్
విచారణను వాయిదా వేసిన ధర్మాసనం



**హైదరాబాద్, మహా :** నిర్దేశించిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత నెల మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించిన ఘటనలో 6 వారాల్లో నివేదిక సమర్పించాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ పేర్కొన్న మూడు ఘటనలే కాకుండా మరో రెండు ఘటనలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని ఆయా ఘటనలో బాధ్యులైన వాళ్లపై చర్యలు తీసుకున్నట్లు ఏఏజీ ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు తెలిపారు. నారాయణపేట్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో వేర్వేరుగా రెండు కమిటీలు ఏర్పాటు చేశామని భోజనం వికటించిన ఘటనపై అధ్యయనం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన ఘటన వెలుగులోకి వచ్చిన విద్యార్థులకు వడ్డించిన పదార్థాల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. 25వేల 941 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మందికి పైగా విద్యార్థులన్నారని వాళ్లలో 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని ఏఏజీ వివరించారు. ఈ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర మార్గనిర్దేశకాల ప్రకారం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కానీ క్షేత్రస్థాయిలో ఇలా చోటు చేసుకోవడం లేదని పిటీషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. ఆహారంలో గుడ్డు కూడా ఇవ్వడం లేదని, మధ్యాహ్న భోజనంలో సరైన ఆహారం పెట్టడం లేదని కోర్టుకు తెలిపారు. ఆ కమిటీలకు అదనంగానే ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై అధ్యయనానికి మరో రెండు కమిటీలు ఏర్పాటు చేశామని అన్ని కమిటీలు నిబంధనలకు అనుగుణంగా పని చేస్తున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డించే ఏజెన్సీలకు ప్రభుత్వం ఇటీవలే 40 శాతం డబ్బులు పెంచినట్లు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

# హైడ్రామా



**హైదరాబాద్, మహా:** ఉదయం నుండి సాయంత్రం దాకా ఓ వైపు గచ్చిబౌలి ఠాణా, మరోవైపు బంజారాహిల్స్ ఠాణాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుంచి రాత్రి 8గంటల ప్రాంతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విడదలయ్యారు. సీఐని బెదిరించిన కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో హరీశ్ రావు ఆయన ఇంటికి వెళ్లగా.. అదే సమయంలో పోలీసులు హరీశ్‌రావును అదుపులో గచ్చిబౌలి స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత వెళ్ళిన జగదీష్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే పదిగంటల నిర్బంధం అనంతరం హరీశ్ రావు స్టేషన్ నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ముందు ఉదయం నుండి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. హరీష్ రావు ను విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆందోళనకారులను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డిలను గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నేతల అరెస్టుపై ఎమ్మెల్సీ కవిత కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా పాలన కాదని.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన అంటూ మండిపడ్డారు. తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని.. వాళ్లని వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. కాగా హరీష్ రావు, కౌశిక్ లను మాజీమంత్రులు సబిత, సునితతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరామర్శించారు. మరోవైపు కౌశిక్ రెడ్డిని విడుదల చేయాలంటూ మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధర్నా నిర్వహించారు.

**కౌశిక్ రెడ్డిని విడుదల చేసే వరకూ బీఆర్ఎస్ నిద్రపోదు- హరీష్ రావు ఆగ్రహం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కాలని చూస్తోంది. ఎఫ్ఐఆర్‌లు పోలీస్ స్టేషన్ నుంచి కాదు..గాంధీ భవన్ నుంచి వస్తున్నాయి. కాంగ్రెస్ పగ, ప్రతీకారాలతో పనిచేస్తోంది. పోలీసులు రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి. రాష్ట్రంలో ఏడో గ్యారంటీగా రాజ్యాంగ ఉల్లంఘనలు. ఇచ్చిన హామీలే మేము అడుగుతున్నాం. కేసీఆర్ కట్టిన నిర్మాణాలను మీరు ప్రారంభిస్తున్నారు. ఏడాది పాలనలో ఒక్క పాలసీ అయినా చేశారా ?. రేవంత్ సీఎంగా పనిచేయట్లేదు. గల్లినాయకుడిగా పనిచేస్తున్నారు. రేవంత్ తెచ్చిన మార్పు అంటే ఇదేనా ?. చట్టాలు, రాజ్యాంగం శాశ్వతం.. సీఎం శాశ్వతం కాదు. ఏడాది పాలనలో మహిళలకు లక్ష కోట్ల రుణమన్నారు. అదంతా బోగస్. వరంగల్ డిక్లరేషన్ 9 హామీల్లో ఒకటి కూడా అమలు కాలేదు. మేం వాటినే అమలు చేయమని సలహా ఇచ్చాం కదా. మూడుసార్లు రైతుబంధు ఇవ్వమని అడిగాం కదా. అవ్వా తాతలకు 4 వేల పింఛన్ ఎపుడిస్తారని అడిగాం కదా. 7 నెలల నుంచి పోలీసులకు టీఏలు ఇవ్వడం లేదు. రైతులకు మద్దతు ధర లేదు, బోనస్ బోగస్ అయ్యింది. రైతు రుణమాఫీ సగం మందికి ఎగ్గొట్టారు. రైతుబంధు ఎప్పుడిస్తారో చెప్పడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది బీఆర్ఎస్ కార్యకర్తలను, మహిళలను అరెస్టు చేశారు. వీళ్లందరినీ వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కూడా విడుల చేయాలి.

**నార్సింగి ఠాణాలో పల్లా రాజేశ్వర్ రెడ్డి**

మాజీ మంత్రి హరీష్ రావు విడుదల కు ధర్నా చేసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని అరెస్టు చేసి వదలక పోవడంతో.. నార్సింగి పోలీసు స్టేషన్‌కు మాజీ మంత్రులు హరీష్‌రావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మరియు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం రాత్రి చేరుకున్నారు.



## బంజారాహిల్స్ పీఎస్ ఎదుట ఎర్రబెల్లి ఆందోళన

హైదరాబాద్, మహా: నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ ఎదుట మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, హరీశ్ రావులను కలిసేందుకు ఆయన పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. దీంతో ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పీఎస్ ముందు బైఠాయించారు. అనంతరం మాట్లాడుతూ.. పాడి కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పోలీసులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే కోర్టులో హాజరుపరచాలంటూ ఆయన డిమాండ్ చేశారు. ఆయనతోపాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మణ్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.



### నిరుద్యోగ కళాకారులకు
# న్యాయం జరిగేలా చూస్తా

**తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ జి వెన్నెల గద్దర్**

గత పాలకులు కళాకారులను మోసం చేశారు : దరువు అంజన్న
ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావిస్తున్నాం : అనుమోజు వెంకన్న
గద్దర్ వారసత్వానికి పదవి దక్కడం హర్షనీయం: కిరణ్

**హైదరాబాద్, మహా :** ప్రజా యుద్ధ నౌక గద్దర్ కూతురు వెన్నెల్లను తెలంగాణ సాంస్కృతి సారధి చైర్మన్‌ఎ గా నియమించడం హర్షించదగ్గ విషయమని కళాకారులు కొనియాడారు, రవీంద్ర భారతి వేదికగా చైర్మన్ వెన్నెలను తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ నేత కాంగ్రెస్ పార్టీ నాయకులు దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక వహించింది కళాకారులేనని, తెలంగాణ సాధించిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కళాకారులను మోసం చేస్తూనే వచ్చిందని, 2015లో దగా పడ్డ కళాకారులు ఉద్యమాలు చేపడితే టిఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అప్రజాస్వామ్యంగా సభలు పెట్టకుండా అరెస్టులు చేసి కేసులు పెట్టి ఉద్యమాన్ని అణచివేసిందన్నారు, దొర పరిపాలనను అంతం చేయడమే ధ్యేయంగా కళాకారులు పల్లె పల్లె తిరిగి గద్దెదించడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. తెలంగాణ సంస్కృతిక సారధిలో ఉద్యోగం చేస్తున్నటువంటి 550 మంది కళాకారులలో 200 మంది ఫేక్ కళాకారులు డబ్బింగ్ కళాకారులున్నారని దుయ్యబట్టారు, గతంలో చైర్మన్ గా వ్యవహరించిన వారు కళాకారులపై కక్ష సాధింపు చర్యగా ఒక జిల్లా కళాకారులను వేరే జిల్లాలో పని చేయిస్తూ చిత్రహింసలకు గురిచేసారని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తప్పక కళాకారులకు న్యాయం చేస్తుందని, ఉద్యోగాలు వచ్చేలా చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు అనుమోజు వెంకన్న మాట్లాడుతూ, పది సంవత్సరాలుగా ఎన్నో కష్టాలకు నష్టాలను ఎదుర్కొని ఉద్యమాన్ని నడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు, రేవంత్ రెడ్డి సైతం మాకు ఉద్యోగాలు ఇస్తానని గతంలో చెప్పారని గుర్తు చేశారు. సభకు అధ్యక్షత వహించిన నకరికంటి కిరణ్ మాట్లాడుతూ పాటే ప్రాణంగా, పాటను నమ్ముకొని బతుకుతున్న కళాకారుల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక వెలుగులు నింపుతుందని, దానికి వెన్నెల సారధిగా వ్యవహరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కళాకారులు ఆటపాటలతో రవీంద్ర భారతిని ఉర్రూతలుగించారు. తరువాత కళాకారులు అందరు కలిసి వెన్నెలను ఘనంగా సత్కరించారు.

# ప్రోబా-3 మిషన్ సక్సెస్

**నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ59**



**మహా:** ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రోబా3 ప్రయోగం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్లోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రోబా3 నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రోబా3 మిషన్లో భాగంగా సుమారు 550 కిలోల బరువున్న రెండు ఉపగ్రహాలను పిఎస్ ఎల్వీ సి59 వాహకనౌక మోసుకెళ్లింది. ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా రెండు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. ఈ మేరకు ప్రయోగం విజయవంతంపై శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఈ ప్రయోగం కృత్రిమ సూర్యగ్రహణం కోసం ..**

సూర్యుడి బయటి పొర అయిన కరోనాను అధ్యయనం చేసేందుకు 'పీఎస్ఎల్వీసీ59/ప్రోబా3' మిషన్ను చేపట్టారు. దీన్ని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ అభివృద్ధి చేసింది. ఈ మిషన్లో.. కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్ , ఒకల్టర్ స్పేస్‌క్రాఫ్ట్ అనే రెండు ఉపగ్రహాలు ఉంటాయి. వీటిని 'స్టాక్డ్ కాన్ఫిగరేషన్'లో అంటే ఒకదానిపై మరొకటి అమర్చి రెండింటినీ కలిపి ఒకేసారి లాంచ్ చేశారు. ఈ రెండు శాటిలైట్లను ఇస్రో పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ద్వారా ప్రయోగించారు. 'ప్రోబా3' మిషన్లో భాగంగా ఎక్స్ ఎల్ రాకెట్ రెండు ఉపగ్రహాలను సరైన కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అనంతరం ఈ రెండు శాటిలైట్లు పరస్పరం సమన్వయంతో ఒక క్రమపద్ధతిలో సూర్యుని చుట్టూ భూకక్ష్యలో తిరగనున్నాయి. సాధారణంగా సూర్యుని ప్రచండ వెలుగుల మధ్య కరోనా పొరను గమనించడం చాలా కష్టం. ఎందుకంటే సూర్యుని ప్రకాశం.. కరోనా బ్రైట్ పాయింట్ కంటే మిలియన్ రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇది టెలిస్కోప్‌ను బ్లైండ్ చేస్తుంది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు కృత్రిమ సూర్యగ్రహణం కోసం పరిస్థితులను సిద్ధం చేసేందుకు ఈ ప్రయోగాన్ని చేపట్టారు.

# పాతికలక్షల ఇండ్లు నిర్మిస్తాం



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో చరిత్రలో ఎవరూ నిర్మించని విధంగా ఐదేళ్ళలో పాతికలక్షల ఇళ్ళు నిర్మించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మ గౌరవాన్ని ఇందిరా గాంధీ కల్పించారని కొనియాడారు. ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలని, ఆ కల నెరవేరాలనే ఇందిరా గాంధీ ఇళ్లు నిర్మించి ఇచ్చారని సీఎం తెలిపారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో కానీ ఇందిరమ్మ కాలనీ లేని ఊరు ఈ దేశంలోనే లేదని చెప్పగలనని సీఎం అన్నారు. కూడు.. గూడు.. గుడ్డ... నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని, ఇళ్ల నిర్మాణం చేపట్టారని సీఎం తెలిపారు. ఇందిరమ్మ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ. 10 వేలు కేటాయిస్తే.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అది రూ. 1.25 లక్షలకు చేరిందని... పెరిగిన ధరల ప్రకారం ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా.. గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చారు. తొలి ఏడాది సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేస్తామని, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య సిబ్బంది, దళితులు, గిరిజనులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గిరిజనులకు ఇళ్లు కేటాయించారని, ఆ తర్వాత వారికి ఇళ్ల కేటాయింపు సక్రమంగా జరగలేదన్నారు. తమ ప్రభుత్వం ఐటీడీఏల పరిధిలోని నియోజకవర్గాలు, ఆ ప్రాంతాల్లోని గిరిజనుల కోసం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## ఆదివాసీలకు ప్రత్యేక కోటా

నల్లమల్లలోని చెంచులు... ఆదిలాబాద్‌లోని గోండులు... భద్రాచలంలోని కోయలు.. ఎవరైతే తెలంగాణ మట్టి మనుషులో.. తెలంగాణ మూల పురుషులో వారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యేకంగా కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంద్రవెల్లికి వెళ్లి తాను స్వయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పట్టాలు అందజేసిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఈ నమూనానే పాటించాలని తాము సూచించడం లేదని, అదే సమయంలో తమకున్న స్థలంలో ప్రతి అంగుళాన్ని లబ్ధిదారులు వినియోగించుకునేలా ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్‌లు నిర్మిస్తామని, లబ్ధిదారులు తమ అవగాహన కోసం వాటిని చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. లబ్ధిదారులు తమ స్థోమతకు తగ్గట్లు అదనపు గదులు నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని కూడా చెప్పారు. గత రుణాలు కూడా మాఫీ 2004 నుంచి 2014 వరకు పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 25.04 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్లను పిట్ట గూళ్లని.. కొడుకు, కోడలు, అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారని ఎన్నికల ప్రచార సభల్లో విమర్శలు గుప్పించిన కేసీఆర్ తన పదేళ్ల పాలనా కాలంలో కేవలం లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ప్రారంభించి 65 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని సీఎం విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇళ్ల పూర్తికి తాము రూ.195 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేదని... కానీ ఆరు నెలల్లో ఆయన కోసం కోట లాంటి ప్రగతి భవన్‌ను, వాస్తు కోసం సచివాలయాన్నినిర్మించుకున్నారని, గజ్వేల్, జన్వాడల్లో ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని సీఎం మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్యం ఎంత గొప్పదైనా అమలులో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందని, పేదవాళ్లకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను సైతం వినియోగిస్తున్నామన్నారు. పునాది స్థాయి నుంచి స్లాబు వరకు ప్రతి దశలోనూ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు.

## కేసీఆర్ ఆలోచనా విధానంలో మార్పు రావాలి

గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్ర ఖజానాను కేసీఆర్‌కు అప్పగిస్తే.. పదేళ్ల పాలనా కాలం తర్వాత ఆయన రూ. 7 లక్షల కోట్ల అప్పుతో తమకు అప్పగించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనా కాలంలో చేసిన అప్పులు.. తప్పులు సరి చేయడానికి తమకు సమయం పడుతోందన్నారు. ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా పని చేసిన కేసీఆర్ తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత రాజశేఖర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని..నాడు అటువంటి మంచి సంప్రదాయం ఉందని..దానిని కొనసాగించాలని కేసీఆర్‌కు సీఎం సూచించారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న హరీశ్ రావు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారని... కాంగ్రెస్‌లో చేరేందుకే హరీశ్‌రావు కలిశారనే విమర్శలు నాడు వచ్చాయని సీఎం అన్నారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం రాజశేఖర్ రెడ్డిని కలిశానని హరీశ్ చెప్పారని.. ఇప్పుడు అలానే కలిసి సమస్యలు విన్నవించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్నప్పుడే రాజశేఖర్‌రెడ్డిని హరీశ్‌రావు కలిశారని.. మరి ఇప్పుడేమైందని సీఎం ప్రశ్నించారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రులను కలిసి కొడంగల్ నియోజకవర్గానికి రూ. వందల కోట్లు తీసుకెళ్లానని సీఎం తెలిపారు. పాలక, ప్రతిపక్షాలు కలవకుండా చేసింది కేసీఆరేనని, శత్రు దేశ సైనికుల్లా రెండు పక్షాలను కేసీఆర్ మార్చివేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేసీఆర్‌లో మానసిక పరివర్తనలో మార్పు రావాలన్నారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎంతగా ఉన్నా ఆ రాష్ట్ర అంశాల విషయంలో పార్టీలకు అతీతంగా వారంతా ఏకమవుతారని.. ఇక్కడ కూడా అలానే కావాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్రంలో 17 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు సూచనలు ఇచ్చేందుకు కలిసి రావాలని కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు.

## చిన్నపిల్లల్లా వ్యవహరించొద్దు

తాము పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆరు నెలలు లోక్‌సభ ఎన్నికల కోడ్‌తోనే సరిపోయిందని.. కేవలం అయిదు నెలల కాలమే తాము పాలనపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అయిదు నెలల కాలంలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చామన్నారు. తాము అభివృద్ధి.. సంక్షేమం రెండింటినీ సమతూకం చేసుకుంటూ ముందుకు పోతుంటే చిన్న పిల్లల్లా కేటీఆర్, హరీశ్ రావు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేయలేనిది తాము ఏడాది కాలంలోనే చేస్తుంటే.. హోం వర్క్ చేయని పిల్లలు హోం వర్క్ చేసిన పిల్లాడి నోట్ బుక్ ను చింపివేసినట్లు.. పక్కన వాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్న పిల్లల్లా ఆ ఇద్దరు ప్రవర్తిస్తున్నారని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. మనం చేయలేని పని వాళ్లు చేస్తున్నందున.. చూస్తూ ఉండాలని వారిద్దరికి హితవు చెప్పాలని కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు మారీచ సుబాహుల్లా, రాహు కేతువుల్లా వారు అడ్డుపడుతున్నారని సీఎం మండిపడ్డారు. తమకు భేషజాలు లేవని వయసులో, అనుభవంలో కేసీఆర్ పెద్దవారని, ఆయన పెద్దరికాన్ని నిలుపుకోవాలని, తప్పులు చేస్తున్న తమ పిల్లలకు బుద్ధి చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శాసన సభలో పాలక పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతిపక్షానికి అంతే ప్రాధాన్యత ఉందని సీఎం అన్నారు. కేసీఆర్ సభకు వచ్చి తాము పాటించే విధానల్లో ఏవైనా లోపాలుంటే తమకు తెలియజేయాలన్నారు.

### కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఆహ్వానం...

సచివాలయంలో డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం.. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో తెలంగాణ సంబరాలు అద్భుతంగా నిర్వహించనున్నట్లు సీఎం చెప్పారు. తెలంగాణ సంస్కృతికి పట్టం కట్టే కార్యక్రమాలు, పిండి వంటలు, మహిళా సంఘాల స్టాళ్లతో ఒక పండుగ వాతావారణం నెలకొంటుందన్నారు. బోనాలు, వినాయక నిమజ్జనం చేసుకునేప్పుడు ఎలాంటి వాతావరణం ఉంటుందో అలాంటి వాతావరణం ఉంటుందన్నారు. ప్రజలంతా వాటిలో పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ప్రతిపక్ష నేత కేసీఆర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తోపాటు ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నేతలను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు. కేసీఆర్ తోపాటు కేంద్ర మంత్రులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా కలిసి ఆహ్వానిస్తారని సీఎం తెలిపారు. ఈ ఉత్సవానికి ప్రతిపక్ష నేత వచ్చి పెద్దరికం నిలుపుకోవాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి, సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.



# హీరో అల్లు అర్జున్‌పై కేసు నమోదు

**సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంష్ యాదవ్**

**హైదరాబాద్, మహా:** ప్రముఖ సినిమా హీరో అల్లు అర్జున్ పై కేసు నమోదు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. 'ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో మహిళ మృతిచెందిన ఘటనలో హీరో అల్లు అర్జున్ టీమ్ పై కేసు నమోదు అయ్యింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ లో పుష్ప2 సినిమా యూనిట్, హీరో అల్లు అర్జున్, సంధ్య థియేటర్ యజమాన్యం, అల్లు అర్జున్ సెక్యూరిటి వింగ్ పై కేసు నమోదు అయ్యింది. సెక్షన్ 105, 118 బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదైంది. తొక్కిసలాటకు థియేటర్ యాజమాన్యమే కారణం. అల్లు అర్జున్ వస్తున్న సమాచారం పోలీసులకు తెలపలేదు. అల్లు అర్జున్ వ్యక్తిగత భద్రత సిబ్బందితో కలిసి లోనికి వెళ్లే క్రమంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు, మహిళ మృతికి కారకులైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని డీసీపీ స్పష్టం చేశారు.

# కేసీఆర్‌ను మించి కేటీఆర్ బూతులు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ చేసిన తప్పులను బయటపెడితే కేసీఆర్ ను మించి కేటీఆర్ బూతులు మాట్లాడుతున్నారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడుతున్న సీఎం రేవంత్ రెడ్డి మీద ఆరోపణలు చేయడం తగదన్నారు. కవిత, కేటీఆర్ చేసిన తప్పులు ఎత్తి చూపితే తలలు ఎక్కడ పెట్టుకుంటారంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా హైదరాబాద్ లో ప్రెస్ మీట్ నిర్వహించిన సురేఖ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రావడం ఎందుకు రావడం లేదు. కేసీఆర్ ఫాం హౌజ్ లో పండుకుని కేటీఆర్ ను మా పైకి ఉసి గొల్పుతున్నాడు. మీరు ప్రజలకు మంచి పాలన అందిస్తే జనాలు మిమ్మలని ఎందుకు ఒడకొట్టారని ప్రశ్నించారు.

# కార్పొరేటర్ టూ సీఎం

**అంచెలంచెలుగా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన ఫడ్నవీస్.. మూడవసారి సీఎం పీఠాన్ని అధిష్టించిన నేత**

**సోషల్ మీడియాలో భారీ ఫాలోవర్స్.. విజయాలను అందించడంలో దిట్ట**

**ముంబై, మహా :** 'నేను సముద్రంలాంటివాడిని, మళ్లీ తిరిగొస్తా' 2019లో సీఎం పదవి కోల్పోయిన తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పిన మాట ఇది. ఆ తర్వాత 2022లో మహావికాస్ అఘాడీ నుంచి అధికారం దక్కించుకున్నా, ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంకే పరిమితమయ్యారు. దాంతో స్థాయి తగ్గిందంటూ ప్రత్యర్థులు ఫడ్నవీస్‌ను ఎగతాళి చేశారు. రాజకీయ పద్మవ్యూహంలో చిక్కుకుపోయారని ఎద్దేవా చేశారు. కానీ, వాళ్లందరికీ తిరిగులేని సమాధానిస్తూ ఆధునిక అభిమన్యుడిలా రాజకీయ పద్మవ్యూహాన్ని ఛేదిస్తూ, ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు ఫడ్నవీస్. మహారాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్పొరేటర్ స్థాయి నుంచి సీఎం స్థాయి వరకు అంచెలంచెలుగా ఫడ్నవీస్ ఎదిగారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తానున్నానంటూ ముందుకొచ్చి మంచి విజయాలను అందించడంలో దిట్టగా పేరొందారు ఫడ్నవీస్.

## రాజకీయ కుటుంబం

మహా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఫడ్నవీస్ 1970 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి గంగాధరరావు ఫడ్నవీస్, తల్లి సరిత. ఫడ్నవీస్ తండ్రి గంగాధరరావు నాగ్‌పూర్ నుంచి మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. తల్లి సరితా ఫడ్నవీస్ విదర్భ హౌసింగ్ క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్. గంగాధర ఫడ్నవీస్‌ను కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత నితిన్ గడ్కరీ పలుమార్లు తన రాజకీయ గురువుగా అభివర్ణించారు. దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృత బ్యాంకర్, సామాజిక కార్యకర్త. ఈ దంపతులకు దివిజా ఫడ్నవీస్ అనే కుమార్తె ఉంది. అలాగే ఫడ్నవీస్ సోషల్ మీడియాలోనూ స్టార్‌గా నిలిచారు. ఆయనకు ఎక్స్‌లో 59 లక్షలు, ఫేస్‌బుక్‌లో 91లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌లో 20 లక్షలు, యూట్యూబ్‌లో 11 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. దీంతో మహారాష్ట్రకు చెందిన రాజకీయ నాయకుల్లో అత్యధిక ఫాలోవర్స్ ఉన్న నేతగా ఫడణవీస్ అవతరించారు.

## రాజకీయ నేపథ్యం

1989లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కు చెందిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విభాగంలో ఫడ్నవీస్ పనిచేశారు. 22 ఏళ్లకే నాగ్‌పూర్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 27 ఏళ్లకే నాగ్‌పూర్ మేయర్‌గా ఎన్నికై అత్యంత పిన్న వయస్సులో మేయర్ అయిన వ్యక్తిగా రికార్డుకెక్కారు. 1999లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో నాగ్‌పూర్ సౌత్ వెస్ట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2013లో మహారాష్ట్ర బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు ఫడ్నవీస్. మహారాష్ట్రలో 2014 లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంలో దేవేంద్ర ఫడ్నవీస్ కీలక పాత్ర పోషించారు. 2014లో బీజేపీ, శివసేనతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఫడ్నవీస్ మహారాష్ట్రకు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. తన మొదటి పదవీ కాలంలో సేవా హక్కు చట్టాన్ని అమలు చేశారు. అలాగే కరవును ఎదుర్కోవడమే లక్ష్యంగా 'జలయుక్త శివార్ అభియాన్'ను ప్రారంభించారు. దీంతో 22,000 కంటే ఎక్కువ గ్రామాల్లో రూ.6 లక్షల కంటే తక్కువ ఖర్చుతో కూడిన నీటి నిర్మాణాలను అభివృద్ధి చేశారు. ముంబై, పూణే మెట్రో విస్తరణ, నాగ్‌పూర్‌ముంబై సమృద్ధి ఎక్స్ ప్రెస్ వే, కోస్టల్ రోడ్ ప్రాజెక్ట్, ముంబై ట్రాన్స్ హార్బర్ వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేశారు. తన మొదటి పదవీ కాలంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయడం సహా పాటు సుపారిపాలన సాగించిన సీఎంగా ప్రజల్లో ఫడ్నవీస్ ఆదరణ పొందారు.

## తప్పని పరిస్థితిలో డిప్యూటీ సీఎంగా

2022లో మహారాష్ట్రలో తీవ్ర రాజకీయ సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో ఫడ్నవీస్ తన రాజకీయ చతురతను నిరూపించుకున్నారు. శివసేన అగ్రనేత ఏక్‌నాథ్ షిండేకు సీఎం పగ్గాలు అప్పగించి, ఆయన ఉపముఖ్యమంత్రిగా కొనసాగారు. తాజాగా జరిగిన మహా ఎన్నికల్లో మహాయుతిని విజయం పథంలో నడిపించి మరోసారి సీఎం పగ్గాలు చేపట్టారు.



### ఇవీ రికార్డులు

మహారాష్ట్ర చరిత్రలో సీఎంగా పూర్తి పదవీ కాలం పని చేసిన రెండో ముఖ్యమంత్రి ఫడణవీస్. 2014-2019 ఫడ్నవీస్ మహా సీఎంగా కొనసాగారు. 1962-1967 వరకు వసంత్ రావు పూల్ సింగ్ నాయక్ సీఎంగా పూర్తి కాలం పని చేశారు. మహారాష్ట్ర దిగ్గజ నేతలు యశ్వంతరావు చవాన్, శంకర్రావు చవాన్, వసంతదాదా పాటిల్, మనోహర్ జోషి, శరద్ పవార్ వంటివారు పూర్తి కాలం సీఎం పదవిలో కొనసాగలేకపోయారు. మహారాష్ట్రకు ముఖ్యమంత్రిగా పనిచేసిన బ్రాహ్మణ వర్గానికి చెందిన రెండో నేతగా ఫడణవీస్ రికార్డు సాధించారు. ఆయన కన్నా ముందు బ్రాహ్మణ వర్గానికి చెందిన మనోహర్ జోషి మహారాష్ట్రకు సీఎంగా పనిచేశారు. మహారాష్ట్రలో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ఏకైక ఉప ముఖ్యమంత్రి కూడా ఫడ్నవీసే. మహారాష్ట్రకు అతిపిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన రెండో వ్యక్తిగా కూడా నిలిచారు ఫడ్నవీస్. 44 ఏళ్ల వయసులో 2014లో సీఎం బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్రలో అతిపిన్న వయసులో ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రికార్డు శరద్ పవార్ పేరిట ఉంది. దేశంలో మూడో అతి తక్కువ కాలం సీఎంగా పని చేసిన రికార్డును బీజేపీ నేత యడియూరప్పతో కలిసి దేవేంద్ర ఫడ్నవీస్ పంచుకున్నారు. 2019 నవంబర్ లో సీఎంగా ప్రమాణం చేసిన ఫడ్నవీస్ మూడు రోజుల్లోనే పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది.

# హుజురాబాద్ ఎమ్మెల్యే ఓ పిచ్చోడు

**బీఆర్ఎస్ పై ప్రజలకు ఎప్పుడో నమ్మకం పోయింది**

**ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ఆ స్థాయి లేదు**

**సీఎం ప్రతికార చర్యలకు దిగితే అందరూ జైల్లో ఉంటారు**

**పదేళ్ళ పాలనలో బీఆర్ఎస్ ప్రజలకు చేసింది శూన్యం**

**మంత్రి కొండా సురేఖ ఘాటు వ్యాఖ్యలు**

**వరంగల్, మహా :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విజయవంతంగా సంవత్సర పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమానికి అహరహం శ్రమిస్తుంటే ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజల ముందు మరింత చులకనవుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ ఫామ్ హౌస్ లో విశ్రాంతి తీసుకుంటూ కేటీఆర్ ను ప్రభుత్వం పైకి ఉసిగొల్పుతూ రాక్షసానందం పొందుతున్నాడన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిండమే ధ్యేయంగా అర్థం లేని ఆరోపణలు చేస్తూ ఏదో సాధించామని అనుకుంటున్నారని పేర్కొన్నారు. పది సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు మిమ్మల్ని ఓడించి, కాంగ్రెస్ పార్టీని గెలిపించారనే విషయాన్ని గమనించాలని కేటీఆర్‌కు మంత్రి సురేఖ సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సామాన్య కార్తకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరే విధంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగుతున్నదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాల వాళ్ళు చూస్తే అసహ్యంచుకునేలా కేటీఆర్ మాట తీరు ఉంటున్నదని మంత్రి సురేఖ అన్నారు. పదేళ్ళు రాష్ట్రాన్ని దోచుకుని, అప్పుల ఊబిలోకి నెట్టి పథకాల అమలును తప్పించుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు చెప్తున్నాడని ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ అవినీతి, అక్రమాల కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా ముందుకు వెళ్తుందని, గత రికార్డులను పరిశీలిస్తే పదేళ్ళ వారి దోపిడీ బయటపడుతుందనే ఎంక్వైరీలకు సహకరించడంలేదని మంత్రి అన్నారు. రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం మొదలు ఫోన్ ట్యాపింగ్ వరకు పాలనంతా అవినీతి, అక్రమాలే అని ప్రజలు తెలుసుకుని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టి సంక్షేమ రాజ్యాన్ని తెచ్చుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ముందుకు సాగకూడదన్న ఉద్దేశంతోనే దానికి బాధ్యులైన అధికారులను విదేశాలకు పంపించారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాధిస్తున్న విజయాలతో కేటీఆర్ కు శాంతి కరువైందని, రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం పడిపోతుందనడం ప్రజాస్వామ్యం పట్ల కేటీఆర్ ఉన్న అవగాహనలేమిని, తెరవెనుక నడిపిస్తున్న కుట్రలను తేటతెల్లం చేస్తుందన్నారు. ఉద్యమ సమయంలో ప్రజలను రెచ్చగొట్టి, వారి భావోద్వేగాలను రగిల్చి కల్వకుంట్ల కుటుంబం పబ్బం గడుపుకుందని, రాష్ట్ర ఏర్పాటు తర్వాత వారికి ఉద్యోగాలివ్వకపోవడంతో ఎంతో మంది యువత భవిష్యత్ అంధకారమైందన్నారు.



## ఊచలు లెక్కించాల్సిందే

సీఎం రేవంత్ రెడ్డిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో వేధించిందని, ఇప్పుడు సీఎం గనుక ప్రతికార చర్యలకు దిగాలని భావిస్తే, వారు చేసిన అవినీతి, అక్రమాలకు అందరికందరు జైల్లో ఊచలు లెక్కించాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాల విషయంలో చట్టబద్ధంగా ముందుకుపోతున్న విషయం అందరూ గమనిస్తున్నారన్నారు.

### స్థాయిని మరిచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

ఎర్రచందనం వ్యాపారం చేసే బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని మంత్రి సురేఖ అన్నారు. వెంకటరెడ్డి తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవిని వదులుకున్న గొప్ప వ్యక్తి అని అన్నారు. అటువంటి వ్యక్తిని రారా పోరా, మడిచిపెట్టుకో అంటూ పరుషంగా సంబోధించడం కుసంస్కారమన్నారు. గంధపు చెక్కల వ్యాపారం చేసే నీ మీదున్న కేసులపై దృష్టి పెడితే నువ్వెక్కడి పోతావో ఓసారి ఆలోచించుకో అని హెచ్చరించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే ఒకతను ఏది పడితే అది మాట్లాడుతూ, అసెంబ్లీలో కూడా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి పై అవాకులు చెవాకులు మాట్లాడుతూ పిచ్చోడిలా వ్యవహరిస్తుంటాడని మండిపడ్డారు.

### ప్రతిపక్షాల కుట్రలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

కాంగ్రెస్ పాలనతో ప్రజల ముఖాల్లో ఆనందాన్ని చూస్తున్నామని, ప్రతి దానికి ఉద్యమం చేస్తామని చెప్తూ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి సూచించారు. కేటీఆర్ తనను తాను ఎక్కువగా ఊహించుకోవడం మానేస్తే బాగుంటుందని సలహానిచ్చారు. ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా కేసీఆర్ స్పందించాలిగానీ, అన్నీ తానే అన్నట్లు వ్యవహరించడం కేటిఆర్ నియంత లక్షాణాన్ని స్పష్టం చేస్తున్నందన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | శుక్రవారం, హైదరాబాద్ | 06-12-2024
ANN తెలుగు

EDITORIAL ఎడిటోరియల్

# దక్షిణకొరియాలో అనూహ్య పరిణామాలు

దక్షిణకొరియాలో చోటు చేసుకుంటున్న అనూహ్య పరిణామాలు కొరియా వాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆకస్మికంగా అధ్యక్షుడికి పదవీగండాన్ని తీసుకొచ్చాయి. అకస్మాత్తుగా ఎమర్జెన్సీ విధించి తీవ్ర వ్యతిరేకత రావడం వల్ల ఆ ప్రకటనను విరమించుకున్న దక్షిణకొరియా అధినేత యూన్ సుక్ యోల్ రాజీనామా చేయాలంటూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. కొన్ని గంటల్లోనే దేశ రాజకీయాలు తలకిందులయ్యాయి. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ యూన్ సుక్ యోల్ మంగళవారం సాయంత్రం 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధించారు. ఉత్తరకొరియా అనుకూల శక్తులను ఏరివేసేందుకు ఇదే సరైన నిర్ణయమని అన్నారు. అధ్యక్షుడి ప్రకటనతో రంగంలోకి దిగిన సైన్యం పార్లమెంటు, ఇతర రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని హుకుం జారీచేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ దేశ జాతీయ అసెంబ్లీ (పార్లమెంట్) వెలుపల వేలాది మంది నిరసనకు దిగారు. వారిని భద్రతా బలగాలు అడ్డుకోవడం ఘర్షణలకు దారితీసింది. 1980 తర్వాత దేశంలో మార్షల్ లా విధించడం ఇదే మొదటిసారి. మరోవైపు జాతీయ అసెంబ్లీలోనూ ఇదే పరిస్థితి కన్పించింది. అధ్యక్షుడి నిర్ణయాన్ని ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ తీవ్రంగా ఖండించింది. అటు సొంత పార్టీ నుంచి కూడా దీనిపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయితే, 'మార్షల్ లా' అమలును వ్యతిరేకిస్తూ తీర్మానం తీసుకురాగా, పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం మార్షల్ లా అమలు చట్టవిరుద్ధం అంటూ స్పీకర్ ప్రకటించారు.

స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో అధ్యక్షుడు యూన్ తన నిర్ణయంపై వెనక్కి తగ్గాల్సి వచ్చింది. దక్షిణ కొరియా చట్టప్రకారం పార్లమెంటులో మెజారిటీ ఓటు ద్వారా ఎమర్జెన్సీని ఎత్తేయవచ్చు. దీంతో ఎమర్జెన్సీ విధిస్తూ తాను తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు యూన్ మరో ప్రకటన చేశారు. అయితే తాజా పరిణామాలతో అధ్యక్షుడిపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. యూన్ తక్షణమే రాజీనామా చేయాలని లేదంటే అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కోవాలని ప్రధాన ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. దీనిపై యూన్ ఇంకా స్పందించలేదు. మరోవైపు ఆయన పదవి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు అధ్యక్షుడి సీనియర్ సలహాదారులు, కార్యదర్శులు చెబుతున్నారు. దక్షిణకొరియా పార్లమెంట్‌లో 300 మంది సభ్యులున్నారు. ఒకవేళ అధ్యక్షుడు అభిశంసనను గట్టెక్కాలంటూ 2/3 వంతు మెజార్టీ అంటే 200 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ, ఇతర చిన్న విపక్ష పార్టీలంతా కలిపి 192 మంది ఉన్నారు. అధ్యక్షుడి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానం 1900తో నెగ్గింది. ఈ పరిణామాలన్నీ చూస్తే యూన్ పదవి నుంచి దిగిపోవడం ఖాయంగానే కన్పిస్తోంది. ఒక నిర్ణయం అనూహ్యంగా దేశాధినేత పదవికే ఎసరు తెచ్చింది.




# ఈసారైనా సారొస్తారా..?

## రా రమ్మంటున్న రేవంత్.. అనుభవం పంచమంటూ ఆహ్వానాలు

ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేసీఆర్ రాకకు సంబంధించి భారీగా చర్చ జరుగుతుంది. ఈసారైనా కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా..? లేదా? అనే అంశంపై అటు నేతల్లో, అటు ప్రజల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఓటమితో సుమారుగా ఏడాది నుంచి ప్రజాక్షేత్రానికి దూరంగా ఉన్న కేసీఆర్ ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారా లేదా? అనేదానిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ కీలక నేతలు హరీశ్ రావు, కేటీఆర్ ఫుల్ యాక్టీవ్ గా పోరాడుతున్నప్పటికీ కేసీఆర్ లేని లోటు స్పష్టంగా కనపిస్తుందంటూ ఇటు ప్రజలు, మరో వైపు నేతలు కూడా లెక్కలు వేస్తున్నారు. ఈ క్రమంలోనే కేసీఆర్ రాక తీవ్ర ఆసక్తిగా మారింది.

**ఎన్నికలు జరిగి ఏడాది గడుస్తుంది. అప్పటి నుంచి కేసీఆర్ అసెంబ్లీకి రెండు సార్లు మాత్రమే వచ్చారు. అది ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి, మరోసారి బడ్జెట్ సమావేశాల మొదటిరోజు... ఈ రెండు రెండు రోజులు మాత్రమే కేసీఆర్ అసెంబ్లీలో ప్రత్యక్షమయ్యారు. వీటితోపాటు పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అడపాదడపాగా ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఆ తరువాత మిగతా రోజులన్నీ కూడా ఫామ్ హౌజ్ కే పరిమితమయ్యారు కేసీఆర్. కనీసం ప్రెస్ మీట్లు గానీ, బహిరంగ సభలు కానీ నిర్వహించలేదు. నేతలు, కార్యకర్తలు ఎవరైనా కూడా ఫామ్ హౌజ్ కే వెళ్లి కేసీఆర్ ను కలుస్తున్నారు. అవసరమైన వారిని అక్కడికి పిలిపించుకుని మాట్లాడుతున్నారు. అంతే తప్ప ఫామ్ హౌజ్ నుంచి కేసీఆర్ బయటకు రావడంలేదు. కేటీఆర్, హరీశ్ రావు, ఇతర పలువురు కీలక నేతలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తూ వస్తున్నారు. జైలు నుంచి విడుదలైన తరువాత కవిత తన ఆగమనం ప్రారంభించింది. దీక్షా దివస్ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నది. అనుచరులు, కార్యకర్తలతో సమీక్షలు జరుపుతున్నారు. ఈ క్రమంలో కవిత ఎపిసోడ్ స్టార్ట్ అయ్యిందని చెబుతున్నారు. కానీ, కేసీఆర్ ఇంకా బయటకు రావడంలేదనే చర్చ వినిపిస్తుంది.**



ఇటు సీఎం రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ కు సవాళ్ల మీద సవాళ్లు విసురుతున్నారు. అసెంబ్లీకి రా కేసీఆర్.. ప్రతిపక్ష నాయకుడిగా నీ బాధ్యతను నిర్వర్తించూ అంటూ రేవంత్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు నిన్ను గెలిపించి ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌజ్ లో ఉంటావా? అంటూ ప్రశ్నిస్తున్నారు. హరీశ్ రావు, కేటీఆర్... వీళ్లెవరు కాదు నువ్వే అసెంబ్లీకి రా.. నువ్వా నేనా చూసుకుందాం.. ఏ టాపిక్ పై అయినా చర్చకు సిద్ధమంటూ సీఎం రేవంత్ రెడ్డి కాలు దువ్వుతున్నారు. ఇందుకు బీఆర్ఎస్ నేతలు సీఎంపై రివర్స్ కౌంటర్లు వేస్తున్నారు. వీరి మధ్య ఎంత రాజకీయ మాటల యుద్ధం కొనసాగుతున్నా కేసీఆర్ మాత్రం బయటకు రావడంలేదు. దీంతో ఇటు బీఆర్ఎస్ శ్రేణుల్లో, అటు ప్రజల్లో కలవరపాటు తప్పడంలేదు.

కాగా, రైతు పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్ రావు మాట్లాడుతూ తాము, తమ అధినేత కూడా అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నామన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రజల ముందు పెడుతామన్నారు. హామీలు ఏమయ్యాయంటూ నిలదీస్తామన్నారు. కానీ, తమకు మైక్ కట్ చేయకుండా సమయం కేటాయించే దమ్ముందా అంటూ కూడా ఆయన సీఎంకు సవాల్ విసిరారు. అయితే, ఇది మాటల వరకే ఉంటుందా.. లేదా నిజంగానే ఆచరణలోకి వస్తుందా అనే సందేహంలో జనాలు ఉన్నారు. ఎందుకంటే ఇప్పటివరకు చోటు చేసుకున్న సందర్భాలే ఇందుకు కారణం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, ఉన్న నేతలు కీలకంగా పోరాడుతున్నా, పలువురు ప్రజాప్రతినిధులు పార్టీని వీడుతున్నా కేసీఆర్ మాత్రం మౌనం వీడడంలేదు.. ఫామ్ హౌజ్ ను వదలడంలేదు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఒకింత బీఆర్ఎస్ కార్యకర్తలను ఆ కలవరపాటు వీడడంలేదు.

కేసీఆర్ ఒకవేళ ఈసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరైతే పరిస్థితి ఎలా ఉండబోతుంది..? ప్రభుత్వాన్ని ఆయన ఏ విధంగా ఇరుకున పెడుతారు..? ఇంతకు ఆయనకు అసెంబ్లీలో తగిన ప్రాధాన్యత లభిస్తుందా..? కేసీఆర్ కు ప్రభుత్వం మైక్ కట్ చేయకుండా సమయం కేటాయిస్తుందా..? లేదా మైక్ కట్ చేసి కేసీఆర్ ను అవమానిస్తుందా..? ఒకవేళ ఆ విధంగా అవమానిస్తే ఆయన రెస్పాన్స్ ఎలా ఉంటుంది..? గత కేసీఆర్ దర్శనమిస్తారా..? లేదా సైలెంట్ గా ఉండి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారా? అనే అంశాలకు సంబంధించి జోరుగా చర్చ జరుగుతుంది. అయితే, ఈసారి అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరయ్యే అవకాశం లేకపోలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే పార్టీ నేతలతో చర్చలు ప్రారంభంచారని చెబుతున్నారు. ఇటు అధికార కాంగ్రెస్ కూడా కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఎటువంటి ప్రసంగాలతో అటాక్ చేయాలనేదానిపై చర్చిస్తున్నారంటా. చూడాలి మరి వాట్ విల్ హ్యాపెన్ అనేది.

# బోధించు.. సమీకరించు.. పోరాడు..

## (నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి)



బోధించు.. సమీకరించు.. పోరాడు.. అనే నినాదంతో ముందుకెళ్లి అణగారిన వర్గాలు, నిరుపేదల పక్షాన నిలబడు. అమాయకుల గొంతువై వినిపించు. చరిత్రను తిరగరాయు అంటూ బోధించారు మహానీయుడు డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్. అంతేకాదు.. చదువును నమ్ముకో విలువను పెంచుకో అంటూ హితబోధ చేశారు. తనకు జరిగిన అవమానాన్ని భవిష్యత్ తరాలకు ఎదురవ్వొద్దంటూ అక్షరాల తోటలో వ్యవసాయం చేశారు అంబేద్కర్. పుస్తకాలతో కుస్తీ చేసి జ్ఞానాన్ని సంపాదించి భవిష్యత్ తరాలకు భరోసాగా నిలిచారు. ప్రపంచ దేశంలోకెల్లా అత్తిపెద్ద రాజ్యాంగాన్ని రచించి యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. నేడు అంబేద్కర్ 68వ వర్ధంతి. ఏప్రిల్ 14, 1891లో జన్మించిన భీంరావ్ రాంజీ అంబేద్కర్(డా. బాబాసాహెబ్ అంబేద్కర్) ప్రముఖ భారత న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త, రాజకీయ నేత, భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి. అంటరానితం, కుల నిర్మూలన కోసం అంబేద్కర్ ఎంతోగానో కృషి చేశారు. నేడు అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఉన్నాయంటే ఈయనే కారణం. అంతేకాదు... స్త్రీలకు రిజర్వేషన్ల విషయంలో కూడా ఈయనే కారణం. వీటితోపాటు ప్రతి ఒక్కరూ ఓటు వేస్తున్నారంటే అంబేద్కరే కారణం. లైబ్రేరీని తన జీవిత పాఠంగా మార్చుకున్న అంబేద్కర్ ముందుచూపుతో రాజ్యాంగం రచించారు. అందులో ఒకటి రాష్ట్రాల ఏర్పాటు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం నేడు తెలంగాణ ఏర్పడి అభివృద్ధిలో దూసుకెళ్తుందంటే ముఖ్యంగా అంబేద్కర్ కారణం. అంబేద్కర్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు 1990లో అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను మరణాంతరం అందించింది. ఇండియానే కాదు.. ఇతర దేశాలు సైతం ఆయనను ఇప్పటికీ కొనియాడుతుంటాయి. ప్రపంచంలోని ప్రముఖ వ్యక్తుల్లో అంబేద్కర్ ఒకరు. అందుకే ఆయనకు ప్రపంచంలో ఎవరికి లేని విగ్రహాలు అంబేద్కర్ కు ఉన్నాయి. ఇండియాలో ఏ ఊరికెళ్లినా మొదటగా కనిపించేది అంబేద్కర్ విగ్రహమే. 65 ఏళ్ల వయసులో డిసెంబర్ 6, 1956న ఆయన కన్నుమూశారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను భారత దేశంతోపాటు ప్రపంచ దేశాలను అధికారికంగా, ఘనంగా నిర్వహిస్తాయి. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బ్రతకాలని గొంతెత్తి చాటిన మహనీయుడి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి.


**- గొల్లెపల్లి మధు, జర్నలిస్ట్**

**రచనలకు ఆహ్వానం**


ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com |
whatsapp-
7436939999

# చలికాలం.. చర్మం పైలం!

***చలికాలంతోపాటే చర్మ సమస్యలూ మొదలవుతాయి. శీతలగాలులకు ఒంట్లో తేమ తగ్గిపోయి.. దురద, చర్మం పగిలిపోవడం లాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. వేడివేడి నీళ్లతో స్నానం చేయడం కూడా.. సమస్యను పెంచుతుంది. ముఖ్యంగా శీతకాలంలో పొడి చర్మం.. ప్రతిఒక్కరినీ ఇబ్బంది పెడుతుంది. జీవనశైలిలో కొన్ని మార్పులవల్ల చలికాలంలో పొడి చర్మం సమస్యనుంచి బయటపడొచ్చు.***



చలికాలంలో చర్మ సంరక్షణకు అందరూ ఆశ్రయించేది.. మాయిశ్చరైజర్లు, క్రీమ్స్‌నే! అయితే, వీటి రక్షణంతా బయటి నుంచే! అదికూడా తాత్కాలికంగానే! పొడిచర్మం సమస్య పూర్తిగా పరిష్కారం కావాలంటే.. చర్మం లోపలి నుంచీ ఆరోగ్యంగా ఉండాలి. ఇందుకోసం ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు - చేర్పులూ చేసుకోవాలి. చర్మం రోజంతా తేమగా ఉండాలంటే.. శరీరానికి తగినంత నీరు అందించాలి. అందుకే, దాహమైనా.. కాకున్నా రోజుకు కనీసం 8 గ్లాసుల మంచినీళ్లు తాగాలి. చలికాలం తీసుకునే ఆహారంలో నెయ్యి, నువ్వుల నూనె ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. స్నానానికి ముందు గోరువెచ్చని నూనెతో శరీరాన్ని మర్దనా చేసుకోవడం వల్ల చర్మానికి కావాల్సిన పోషణ అందుతుంది. రక్త ప్రసరణ పెరిగి.. చర్మం తేమగా ఉంటుంది. ఇందుకోసం బాదం, నువ్వులు, కొబ్బరి నూనెలు ఎంచుకోవడం మంచిది. రెగ్యులర్‌గా ఉపయోగించే సబ్బులను పక్కన పెట్టండి. ఇవి చర్మంలోని సహజ నూనెలను తొలగిస్తాయి. దాంతో చర్మం పొడిబారుతుంది. కలబంద, పసుపు, వేప లాంటి సహజ పదార్థాలున్న సబ్బులను వాడండి. ముఖ్యంగా సున్నిపిండితో స్నానం చేయడం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. నాణ్యమైన నిద్ర చాలా అవసరం. అందుకే, రోజూ కనీసం 8 గంటలు నిద్రపోండి. శీతకాలంలో మామూలు 'టీ'కి బదులుగా.. అల్లం, దాల్చిన చెక్క లాంటి సుగంధ ద్రవ్యాలతో చేసిన 'హెర్బల్ టీ'ని ఎక్కువగా తీసుకోవాలి. ఇవి శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంతోపాటు, బాడీకి కావాల్సిన వేడిని అందిస్తాయి.



## చరిత్రకు అడుగు దూరంలో కోహ్లీ

సుదీర్ఘ కెరీర్‌లో ఇప్పటికే లెక్కలేనన్ని రికార్డులన్ని తన ఖాతాలో వేసుకున్న కింగ్.. మరో అరుదైన ఘనతపై కన్నేశాడు. పింక్ బాల్ టెస్ట్‌కు ముందు రెండు అరుదైన రికార్డులు కోహ్లీని ఊరిస్తున్నాయి. అడిలైడ్ టెస్ట్‌లో విరాట్ మరో సెంచరీ గనుక సాధిస్తే సచిన్‌ను అధిగమిస్తాడు. బోర్డర్-గవాస్కర్ హిస్టరీలో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా మాస్టర్ బ్లాస్టర్ ఉన్నాడు. ఒకవేళ ఈ మ్యాచ్‌లో గనుక మూడంకెల స్కోరును చేరుకుంటే సచిన్‌ను దాటేస్తాడు కోహ్లీ. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ సిరీస్‌లో అత్యధిక సెంచరీల లిస్ట్‌లో టెండూల్కర్ (9) తో కలసి విరాట్ సంయుక్తంగా ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నాడు. బ్యాటింగ్ గ్రేట్‌ను అధిగమించేందుకు విరాట్‌కు ఇది మంచి అవకాశం అనే చెప్పాలి. ఆల్రెడీ పెర్త్ టెస్ట్‌లో కోహ్లీ సెంచరీ బాదిన ఊపులో ఉన్నాడు కాబట్టి అదే జోరును పింక్ బాల్ టెస్ట్‌లోనూ కొనసాగిస్తే సచిన్ రికార్డుకు ఎసరు పడినట్లే.

# కనిపించని అధికారులు, భయపడని కాంట్రాక్టర్

### కాంట్రాక్టర్ పై మండిపడుతున్న వ్యాపారులు.. కలకలం రేపుతున్న డ్రైనేజీ పనులు







**అశ్వారావుపేట, డిసెంబర్ 5, మహా:** అశ్వారావుపేట పట్టణ సుందరీకరణ పేరుతో చేపట్టిన డ్రైనేజీ పనులు ప్రజలను ఇబ్బందుల్లో నెట్టాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ తీరుతో ప్రజలు తీవ్ర అసహనంలో ఉన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ పనుల పర్యవేక్షణలో భాగంగా పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**కాంట్రాక్టర్ తీరుపై వ్యాపారుల ఆరోపణలు**

డ్రైనేజీ పనులు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నాడని స్థానికులు మండిపడుతున్నారు. పనులను ఒక వరుసగా చేయకుండా, ఇష్టం వచ్చినట్లు తవ్వించటం, తమ షాపుల ముందు పనిచేయకపోవడం వల్ల మురుగు నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు వ్యాపారులు, డబ్బులు ఇచ్చినవారికి ముందు పనులు పూర్తి చేసి, ఇవ్వనివారిని నిర్లక్ష్యం చేస్తున్నారు అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. మురుగు కాలువలు పూర్తికాకపోవడంతో వాడిన నీరు నిల్వ ఉండి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బయటకు రావాలంటేనే భయం వేస్తోంది అని స్థానికులు చెబుతున్నారు.

**రెండు శాఖల మధ్య విభేధాలు**

అశ్వారావుపేటబూర్గంపాడు రోడ్ 1.5 కి.మీ, ఖమ్మందేవరపల్లి రోడ్ 2 కి.మీ మేర డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు కొనసాగుతున్నాయి. డ్రైనేజీ నిర్మాణం కోసం విద్యుత్ స్థంబాలను తొలగించాలని ఆర్ అండ్ బి శాఖ విద్యుత్ శాఖకు లేఖ రాయగా, వీటిని తొలగించడానికి రూ.1 కోటి ఖర్చు అవుతుందనీ, అది చెల్లిస్తేనే తొలగిస్తాం అని విద్యుత్ శాఖ స్పష్టం చేసింది.

**సుందరీకరణ పేరుతో... ప్రజలకు కష్టాలు**

డ్రైనేజీ పనులు చేపట్టడం వల్ల రహదారులు దెబ్బతిన్నాయి. రోడ్లపై దుమ్ము, మురుగు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుందరీకరణ పేరుతో పని ప్రారంభించి ఏడాది దాటినా గోతులే కనిపిస్తున్నాయి. ఎప్పటికి ఇవి పూర్తవుతాయో తెలియడం లేదు అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ అభివృద్ధి పేరుతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పనులు ఇప్పటికీ కొలిక్కి రాలేదు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని, డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మేము సౌకర్యాలు కోరుకోలేదు, కనీసం అసౌకర్యాలను తప్పించండి అని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఆదివాసీల పక్షాన ఆలోచించే పార్టీ కాంగ్రెస్

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

**హైదరాబాద్, మహా:** ఆదిలాబాద్ లో కాంగ్రెస్ ను బలోపేతం చేయడం కోసం సోయం బాపూరావు, ఆత్రం సక్కును కాంగ్రెస్ లో చేర్చుకున్నామని, ఆదివాసీల పక్షాన కాంగ్రెస్ ఆలోచిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. పది ఏండ్ల కాలంలో ఆదివాసీలకు కేసీఆర్ న్యాయం చేస్తారని ఆత్రం సక్కు బీఆర్ఎస్ లోకి పోయాడని, అధికారంలోకి ఎవరు వచ్చినా ఆదివాసీలను అణగదొక్కే ప్రయత్నం చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసీల కోసం ఆలోచిస్తున్నాడని, అందుకే కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. పదవులు ఆశించి కాంగ్రెస్ లోకి రావట్లేదన్నారు.

## ప్రమాదకర కరెంటు స్తంభం తొలగించాలి

### స్థానిక రైతులు



**ఇబ్రహీంపట్నం: డిసెంబర్ 5 మహా:** మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ పంట పొలంలో ప్రమాదకరంగా కరెంటు స్తంభం భయంతో రైతులు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో వ్యవసాయ పొలంలో ప్రమాదకరంగా మారిన 11 కెవి విద్యుత్ స్తంభం ఒక వైపుగా వరగడంతో ఎప్పుడు విరిగి పడుతుందనే భయంతో అక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. అలాగే ఫిరంగినాల పారుతున్న ప్రాంతంలో ఇనుప స్తంభాలు ఉండడంతో ఇండక్షన్ రావడంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

## కాంగ్రెస్ పాలనకు పాస్ మార్కులు



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ఏడాదిపాలను వివిధ సర్వేలలో పాస్ మార్కులు వేస్తున్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 39.40 శాతం ఓట్లు సాధించగా, తాజాగా వోటా నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ పాలనపై 53శాతం మంది సంతృప్తిగా ఉన్నట్లు తేలింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ 60శాతం మార్కులతో పాస్ అయిందన్నారు. ఐదుమాసాలు లోక్ సభ ఎన్నికలు, కోడ్ కారణంగా పోగా.. కాంగ్రెస్ జాతీయ పార్టీ కావడంతో తొలి ఏడాది కొన్ని నిర్ణయాలు వేగంగా జరగలేదు. అయినా ప్రజల్లో కాంగ్రెస్ పై మోజు పోలేదని స్పష్టమవుతోంది. అయితే మరోవైపు బిఆర్ఎస్ కూడా అదే స్థాయిలో బలంగా ఉంది. లోక్ సభ ఎన్నికల్లో సున్నావచ్చినా గ్రౌండ్ లో బలంగానే ఉంది. ప్రజావాణి దరఖాస్తులు కొన్ని పరిష్కారం అవుతాయని, ఆరు గ్యారంటీలు కొన్ని మంచిగానే అమలవుతున్నాయని సర్వేలలో పేర్కొన్నారు. జీతాలు, పెన్షన్లు సకాలంలో అందుతున్నాయని 73శాతం మంది స్పష్టంగా చెప్పడం విశేషం. వ్యక్తిగతంగా కేసీఆర్ క్రేజ్ తెలంగాణలో అలాగే ఉండగా, రేవంత్ ప్రభుత్వానికి ఐదేళ్ళు ఢోకాలేదని ప్రజలు సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి 41శాతం మంది 50శాతానికి పైగా మార్కులు వేస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్ పాలన ఆశాజనకంగా ఉందని, అయితే అద్భుతంగా లేదని చెప్పేస్తున్నారు. మూసీ ప్రక్షాళన అవసరమని 50శాతం మంది అభిప్రాయపడుతుండగా, హైడ్రాపై భగ్గుమంటున్నారు.

**రేవంత్ మాటకారి**

రేవంత్ మాటకారి అని.. ఆయన స్పీచ్ లకు అభిమానులున్నారని సర్వేలో వెల్లడైంది. పలు అభిప్రాయాలను ప్రజలు కుండబద్దలు కొట్టారు. కేసీఆర్ కాళేశ్వరం పేరుతో దోచుకుంటే.. రేవంత్ మూసీ పేరుతో దోచుకుంటాడని కొందరు విమర్శలు చేయగా, కేసీఆర్ చేసిన రచ్చ సరిచేయాలంటే ఖచ్చితంగా టైం పడతదని, ముఖ్యమంత్రిగా రేవంత్ కు మరింత సమయం ఇవ్వాలని పలువురు వోటా సర్వే సందర్భంగా అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ఫాంహౌజ్ కే పరిమితం కావడం మంచిది కాదని, అధికారం లేకుండా బిఆర్ఎస్ ఆగలేకపోతోందని పలువురు విమర్శించారు. కేసీఆర్ మీద కోపంతో కాంగ్రెస్ కు ఓటేశామని, రేవంత్ కు బండిసంజయ్, ధర్మపురి అర్వింద్ పరోక్షంగా సపోర్ట్ చేస్తున్నారని సర్వేలో పలువురు అభిప్రాయాలు వెల్లడించారు. తులం బంగారం ముచ్చట తుంగలో తొక్కారని, జీరో బిల్లు విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఆర్టీసీ బస్టాండ్ లో ప్రజా పాలన విజయోత్సవాలు



**ఆదిలాబాద్ మహా :** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజర్షి షా హాజరు కాగా...ఆయనకు అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను అధికారులు వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మహిళలకు బస్సుల్లో కల్పిస్తున్న ఉచిత ప్రయాణం వంటి అంశాలను సైతం వివరించారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ....ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన నాటి నుండి ఆర్టీసీ లో సమర్ధవంతంగా సేవలందిస్తూ మహిళలకు ఇబ్బంది కలగకుండా బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం విజయవంతానికి సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్.ఎం సోలోమాన్, జైనథ్ మార్కెట్ కమిటి చైర్మన్ అశోక్ రెడ్డి, డీపీఆర్వో తిరుమల,డిపో మేనేజర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం



**ఇబ్రహీంపట్నం: డిసెంబర్ 5 మహా:** ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం. గురువారం స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నివాసంలో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ పాలకవర్గం సభ్యులు, మర్యాదపూర్వకంగా కలిసి తమ ఎన్నికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేసి, మార్కెట్ అభివృద్ధికి దోహదపడాలని కోరడం జరిగింది. నూతనంగా ఎన్నికైన వ్యవసాయ కమిటీ పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతులకు సాయసహకారాలు అందించాలని, సకాలంలో అందుబాటులో ఉంటూ, వారికి ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా చూడాలని తెలిపారు. రైతుల పట్ల తాను ఎప్పుడు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, రైతులకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తూ రైతుల సంక్షేమం కొరకై పనిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, పిఎసిఎస్ చైర్మన్ ఏదుల పాండురంగారెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు భరత్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు నాయకులు పలువురు పాల్గొన్నారు.

## ప్రజా పాలనతోనే అన్నీ వర్గాలకు న్యాయం

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి



**అబ్దుల్లాపూర్మెట్, మహా:డిసెంబర్ 05:** కాంగ్రెస్ ప్రజా పాలనతోనే అన్నీ వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రజా పాలన విజయోత్సల సందర్భంగా గురువారం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధి మొదటి వార్డులో నిర్మించిన, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ పనులను పెద్ద అంబర్పేట్మున్సిపల్ చైర్పర్సన్ పండుగల జయశ్రీరాజు, వార్డు కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనతోనే అన్నీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజీవ్ గృహకల్పలో కమ్యూనిటీ హాల్ కోసం గతంలో రూ.10లక్షలు ఖర్చు చేసి కనీసం బెస్మెంట్ కూడా నిర్మించలేదన్నారు. ప్రజా పాలనలో హాల్ను నిర్మించడానికి ప్రత్యేక నిధులు రూ.1.20లక్షలు కేటాయించి...కమ్యూనిటీ హాల్ను పూర్తి చేసి... ప్రారంభోత్సవాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్గౌడ్, రాజీవ్ గృహకల్ప కాలనీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## వీఎం గోడౌన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి




**ఇబ్రహీంపట్నం: డిసెంబర్ 5 మహా:** రంగారెడ్డి జిల్లాలోని రాజేందర్ నగర్ ఈవీఎం గోడౌన్స్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని గదులను కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భాంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం భద్రపరిచిన గోడౌన్ ను వారి సమాక్షంలో సీల్ వేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జ్ బొమ్మ రాములు, రాజవర్ధన్ రెడ్డి ఎలక్షన్ సుపరిటెండెంట్, కె. రఘు టెక్నికల్ మానేజర్ రంగారెడ్డి, సంబంధిత అధికారులు, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, సిపి ఐ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏశాల మహేందర్ నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షునిగా విజయం



డిసెంబర్ 5 గురువారం నిజామాబాద్ జిల్లా రూరల్ నియోజకవర్గం కాంగ్రెస్ యూత్ అధ్యక్షులుగా ఏశాల మహేందర్ గెలుపొందడంతో రూరల్ నియోజకవర్గ యువకులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యూత్ ప్రెసిడెంట్ గా విజయం సాధించిన వేషాల మహేందర్ కు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ని మరియు డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డిని కలిసి నా గెలుపుకు కృషి చేసినందుకు వారిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు .ఈ సందర్భంగా రూరల్ యూత్ అధ్యక్షుడు ఏషాల మహేందర్ మాట్లాడుతూ నా గెలుపుకు కృషిచేసిన సిరికొండ , ధర్పల్లి ,జక్రాన్ పల్లి, ఇందల్వాయి, డిచ్ పల్లి, మోపాల్ , నిజామాబాద్ రూరల్ మండలాల కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు ,యూత్ సభ్యులకు ,నాకు ఓటు వేసిన ప్రతి యువతి ,యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో యువతకు నా వంతు కృషి చేయడానికి నేను అహర్నిశలు ప్రజల వెంట ఉండి యువత సమస్యలపై ప్రతిక్షణం ఆలోచన చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.

## పిల్లల కోసం బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం

### నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) నివేదికలో వెల్లడి



**మహా:** చిన్నారులు ఊబకాయానికి గురవ్వకుండా బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీవీలో వచ్చే జంక్‌ఫుడ్ యాడ్స్ పగటి వేళ ప్రసారం చేయడంపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 2025 అక్టోబరు నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. బ్రిటన్‌లో చిన్నారులు ఎక్కువగా ఊబకాయంతో బాధపడుతున్నట్లు నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) నివేదికలో వెల్లడించింది. ఈ డేటా ప్రకారం.. పది మంది చిన్నారుల్లో ఒకరు (9.2 శాతం) ఈ సమస్యతో బాధపడుతున్నారు. అధిక చక్కెర వినియోగం కారణంగా ఐదేళ్ల వయసున్న వారిలో 23.7 శాతం మంది దంత క్షయం సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సంఖ్య పెరుగుతుండడంపై బ్రిటన్ ప్రభుత్వం స్పందించింది. చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారిస్తోంది. అధిక చక్కెరలు, కొవ్వు, ఉప్పు మోతాదు ఎక్కువగా ఉన్న పదార్థాలు, శీతల పానీయాలు ఇలా అనారోగ్యానికి కారణమయ్యే ఆహార పదార్థాలకు సంబంధించిన యాడ్స్ విషయంలో కీలక నిర్ణయం తీసుకొంది.





# ఐటీడీఏలకు నిధుల కేటాయింపు హర్షణీయం

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

### ములుగులో సీఎం, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం

**ములుగు, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఇండ్ల నిర్మాణానికి ఐటీడీఏలకు నిధులు కేటాయించడం హర్షణీయమని, ఇందుకుగాను ప్రభుత్వానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ములుగులోని జాతీయ రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి సీతక్క కృషి వల్ల సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ములుగు జిల్లా ప్రజలు ఆనందంతో ఉన్నారన్నారు. ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఐటీడీఏలకు ప్రత్యేక నిధులు కేటాయించారని కొనియాడారు. మంత్రి సీతక్క కృషితో మల్లంపల్లి మండలం, బస్ డిపో మంజూరు చేశారని, రాబోవు రోజుల్లో ములుగును మున్సిపాలిటీగా ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు కోట్లాది రూపాయలు ఆదా చేసుకున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ములుగు బస్టాండ్ లో జరిగిన కార్యక్రమంలో వరంగల్ 2 డిపో మేనేజర్ జ్యోత్స్న తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేయడానికి మహాలక్ష్మి పథకం అమలు చేశామని, ఇప్పటి వరకు 114.34 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం వినియోగించుకోవడం ద్వారా రూ. 3856.40 కోట్ల రవాణా ఛార్జీలను ఆదా చేసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖా మంత్రి సీతక్క చొరవతో ఏటూరునాగారంలో బస్ డిపో మంజూరు కావడమే కాకుండా ములుగు జిల్లా కేంద్రంలో రూ. 2 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని అన్నారు. మంగపేట మండల కేంద్రంలో బస్ స్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, రాష్ట్రంలోని మహిళలు ఉచిత బస్సు ప్రయాణంను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

**తాడ్వాయి, డిసెంబర్ 5, మహా:** మండలంలోని మేడారం గ్రామానికి చెందిన పులి మాదిరి క్రాంతి (24) అనే యువకుడు మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన గురువారం మేడారంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం క్రాంతి ఒక అమ్మాయిని ప్రేమించాడని, అమ్మాయి నిరాకరించడంతో మనస్థాపానికి గురై ఉరి వేసుకుని మృతి చెంది ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటన జరిగిన అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

# క్రీడలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతాయి

## కలెక్టర్ దివాకర టీఎస్.. ములుగులో క్రికెట్ క్రీడాపోటీలు ప్రారంభం



**ములుగు, మహా:** క్రీడలు శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటునందిస్తాయని, అదేవిధంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కూడా దోహదపడుతాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడల అధికారి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ తో కలిసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో క్రికెట్ ఆడి అలరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8 వరకు క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి విద్యతోపాటు క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి తమదైన శైలిలో ప్రతిభా సామర్థ్యాన్ని ప్రదర్శించడం గొప్ప విషయంగా కొనియాడారు. సీఎం కప్ పోటీలు గ్రామపంచాయితీల పరిధిలో 7, 8వ తేదీలలో, మండల పరిధిలో 10 నుంచి 12 వరకు, జిల్లా స్థాయిలో 16 నుంచి 21వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ బండారుపల్లి మోడల్ స్కూల్లో కబడ్డీ, ఏటూర్ నాగారంలో హ్యాండ్ బాల్ క్రీడలలో ములుగులో క్రికెట్ లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి (ఇంచార్జీ) తుల రవి, కోచ్ లు సందీప్ పైడిమల్ల, పి.జనార్దన్, కుమార స్వామి, అదికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హరీష్ రావు అరెస్టును ఖండించిన మండల కమిటీ



**చర్ల, డిసెంబర్ 05, మహా:** బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు కో కన్వీనర్ ఐనవోలు పవన్ కుమార్ ఆధ్వర్యంలో చర్ల అంబేద్కర్ సెంటర్ లో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక యువ ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీష్ రావుని అక్రమంగా అరెస్టు చేశారని, ప్రజల తరుపున పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడతామంటే అదిరేది లేదు, బెదిరేది లేదన్నారు. రేవంత్ రెడ్డి మీరు ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 హామీలు అమలు చేసే వరకు ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లేబ్బాయి, వేములవాడ కృష్ణార్జున్, గణేష్, బీసీ సెల్ అధ్యక్షులు గోరింట్ల వెంకటేశ్వరరావు, ఎస్టీ సెల్ కార్యదర్శి కారం కన్నారావు, ఎస్సీ సెల్ కార్యదర్శి విజయరావ్, టౌన్ కార్యదర్శి గాదంశెట్టి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో భవిష్యత్ బాగుంటుంది



**చర్ల, డిసెంబర్ 5, మహా:** చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని లింగాపురం ప్రభుత్వ ఉపాధ్యాయుడు జవ్వాది నరేంద్ర బాబు అన్నారు. గురువారం మాతృమూర్తి జవ్వాది సాయిలక్ష్మి మూడవ వర్ధంతి సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ విద్యార్థులకు రూ. 20 విలువ చేసే నూతన దుస్తువులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు భోజనవసతి కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ తల్లిదండ్రులు జయకుమార్ సాయిలక్ష్మి దంపతులు ఎందరో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందచేసి వారి ఉన్నతికి తోడ్పడ్డారన్నారు. వారు అందించిన స్ఫూర్తిని పునికిపుచ్చుకొని తాము కూడా సేవా మార్గాన పయనిస్తున్నట్లు వెల్లడించారు. పేద విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టినప్పుడే భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. ఒక కుటుంబంలో ఒకరు ప్రయోజకుడుడయితే భవిష్యత్తు తరాలు బాగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రదానోపాధ్యాయులు బీవీఎస్ఎల్ నర్సింహారావు, జవ్వాది కుటుంబ సభ్యులు జవ్వాది రవికుమార్, జవ్వాది మురళీకృష్ణ, జవ్వాది శ్రీనివాసరావు, పామర్తి కౌశిక్, నిలయ కమిటీ సభ్యులు తాటి పాపారావు, మల్లాది సుబ్రహ్మణ్యం, లలిత, బందా స్వరూపరాణి, గోగికార్ రాంలక్ష్మణ్, గొంది శోభన్, గొంది ప్రసన్న, లవన్ కుమార్ రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

# మణుగూరులో పండ్ల మొక్కల పంపిణీ



**మణుగూరు, డిసెంబరు 4, మహా:** ధనం మూలం ఇదం జగత్ నిన్నటి మాట.. పచ్చదనం మూలం ఇదం జగత్ అనేది నేటి మాట అని ఓసీ మేనేజర్ బి రాజేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం మణుగూరు మున్సిపాలిటీ పరిధి శివలింగాపురం వైకుంఠ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఆదేశానుసారం సింగరేణి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కొబ్బరి, మామిడి, జామ, పనస, నిమ్మ, బత్తాయి, సపోటా, 250 ఉచిత పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పచ్చదనం ప్రాధాన్యతను ప్రజలు గుర్తించారని, అందుకే పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, డబ్బు కన్నా పచ్చదనానికి ప్రాధాన్యత పెరిగిందని ఆయన అన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు సింగరేణి ఆధ్వర్యంలో మణుగూరు ప్రాంతంలో అనేక రకాల పండ్ల పూల మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎంతటి ఖర్చుకైనా వెనకాడకుండా ప్రతి సంవత్సరం నిరంతరాయంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన తెలిపారు. పూలు పండ్ల మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి జె శ్రీనివాస్, సతీష్, విజయ్ సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్ డి నాసర్ పాషా, వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, ఆలయ అర్చకులు బాలాజీ శర్మ, గ్రామ పెద్దలు, వెంకటేశ్వర్లు రాధాకృష్ణ, పి భద్రం, దేవేందర్, శ్రీకాంత్, బానోతు లక్ష్మణ్, వడ్డే సత్యనారాయణ, వీసాల కావ్య, పద్మ, స్వాతి, ఖాన్, రాంబాబు యాదాద్రి, పెద్ద ఎత్తున శివలింగాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే పాయం



**గుండాల, మహా:** అభివృద్ధి తమ ధ్యేయమని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గుండాల మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమం దిశగా ముందుకు పోతుందని, ప్రజల సమస్యలే ప్రభుత్వ ఏజెండా అని ఆయన అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేసే దిశగా పనిచేయాలని ఆయన కోరారు. మండలంలోని ముత్తాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ స్కూల్ పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలని అధికారులు, గుట్టేదారులను కోరారు. ఆర్ అండ్ బీ రోడ్డు నుండి ఏకలవ్య పాఠశాల వరకు 45 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి కృషి తహశీల్దార్ ఇమ్మానియేల్ శ్యాంసుందర్ రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ రామనాథం, ఐటీడీఏ డీఈ రాజు, గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి, వివిధ శాఖల ఏఈలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ధారా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన విజయోత్సవాలపై కళాయాత్ర



**ములుగు, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన సంవత్సరకాలంలో చేపట్టిన అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వ విజయాలను వివరిస్తూ తెలంగాణ కళాసారథి కళాబృందం ఆధ్వర్యంలో గురువారం మండలంలో కళాజాత, కళాప్రదర్శనలు నిర్వహించారు. ములుగు మండలం వెంకటేశ్వర్ల పల్లే, నౌశ్య తండ, మాన్ సింగ్ తండ గ్రామాలలో ఆరు గ్యారంటీల పథకాలను వివరిస్తూ కళాయాత్ర నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కళాప్రదర్శన ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మొద్దని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని పాటల ద్వారా వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి సద్వినియోగపరుచుకోవాలంటూ కళాప్రదర్శనలతో తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కళాప్రదర్శనలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఎండీ రహీముద్దీన్, మార్త రవి, రాగుల శంకర్, రేలా విజయ్, అమ్మ పాట తిరుపతి, గోల్కొండ నరేష్, శ్రీలత, శోభ పాల్గొన్నారు.

# పోలీసుల ఎదుట లొంగిపోయిన మహిళా మావోయిస్టు



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, డిసెంబర్ 5, మహా:** నిషేధిత సీపీఐ మావోయిస్ట్ పార్టీ, శాంతికారి ఆదివాసీ మహిళా సంఘం (కేఏఎంఎస్) సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన మడివి మంగ్లీ తమ ఎదుట లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా నిషేధిత సీపీఐ మావోయిస్ట్ పార్టీ ఆదివాసీ ప్రజలలో ఆదరణ, నమ్మకం కోల్పోయి సీజీ ప్రాంతానికే పరిమితమైనదని, కాలం చెల్లిన సిద్ధాంతలతోపాటుగా, కమిటీలను ఏర్పాటు చేసి బలవంతపు వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తూ, ఏజెన్సీ ప్రాంత అభివృదిని అడ్డుకుంటూ అమాయకపు ఆదివాసీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ విషయాలను గ్రహించిన మడివి మంగ్లీ మావోయిస్ట్ పార్టీని వీడి గురువారం పోలీసుల ఎదుట లొంగిపోయారన్నారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే పార్టీ సభ్యులు వారి కుటుంబ సభ్యుల ద్వారా గానీ లేక స్వయంగా గానీ, తమ దగ్గరలో గల పోలీస్ స్టేషన్లో లేదా జిల్లా ఉన్నతాధికారుల వద్ద గానీ సంప్రదించాలన్నారు. లొంగిపోయే దళ సభ్యులకు జీవనోపాధి, పునరావాసం కలిపించడం కోసం ప్రభుత్వం తరుపున అందవలసిన అన్నీ రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందన్నారు.

# ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం



**ములుగు, మహా:** రాయనిగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయమని పాఠాశాల ప్రధానోపాధ్యాయులు బి. హిరులాల్ అన్నారు. ముంబైకి చెందిన సంస్థ నిర్వహించిన రంగోత్సవంలో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారని, ఇందులో 8 విద్యార్థులకు గోల్డ్ మెడల్, 5 గురికి సిల్వర్, మరో ఐదుగురు బ్రౌన్ మెడల్స్ సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెడ్ మాస్టార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. గోల్డ్ మెడల్ తీసుకున్న విద్యార్థుల్లో మహేశ్, సంజయ్ కుమార్, సన్నీ అభినయ్, ఋతిక్, అభినంద్, యశ్వంత్, అఖిల్, సిల్వర్ మెడల్స్ రిసి, సాత్విక్, జశ్వంత్, సిద్ధు, ప్రణయ్, బ్రౌన్ మెడల్స్ సాధించిన విద్యార్థులు సిద్ధార్థ, చందు, వర్శిథ్, రాజేష్, సైతేజలు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు సంపత్, శ్రవణ్ కుమార్, డీటీ రవీందర్, సాంబయ్య, గోపి సింగ్, రాందాస్, రాజు, పిడి నారాయణ, అల్లెం నారాయణ, కసన్ సింగ్, వెంకటేశ్వర్లు, పరంసింగ్, కృష్ణమూర్తి ప్రశంసించారు.


# డిసెంబర్ 9న బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు

## చల్పాక అడవుల్లో బూటకపు ఎన్కౌంటర్..ఏడుగురికి విషమిచ్చి చంపేశారు

### మావోయిస్టు పార్టీ తెలంగాణా అధికార ప్రతినిధి జగన్

**ములుగు, మహా:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాకలో జరిగింది ముమ్మాటికి బూటకపు ఎన్‌కౌంటర్ అని, ద్రోహి ఇచ్చిన సమాచారంతో విషమిచ్చి ఏడుగురుని పొట్టన పెట్టుకున్నారని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్త బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ద్రోహి ఇచ్చిన సమాచారంతో డిసెంబర్ 1వ తేదీన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక గ్రామ పంచాయితీ అడవుల్లో పూలకొమ్మ తోగు వద్ద తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు విప్లవకారులకు విషమిచ్చి అతి కిరాతంగా చంపారన్నారు. నవంబర్ 30వ తేదీ సాయంత్రం ఏడుగురితో ఉన్న తమ దళం చల్పాక పంచాయితీలో ఉన్న వలస ఆదివాసీ గ్రామాన్ని కలిసి నమ్మిన వ్యక్తికి తినడానికి భోజనాలు ఏర్పాటు చేయమని చెప్పారని, ముందుగానే పోలీసులకు అప్రూవర్ గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం ఇచ్చి స్పృహం కోల్పోయే లాగా చేశారన్నారు. స్పృహ కోల్పోయిన కామ్రేడ్స్ ను పట్టుకుని చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు అతి సమీపం నుండి కాల్చి చంపారని విమర్శించారు. శతృవు మోసపూరిత పథకంలో చిక్కి అమూల్యమైన కామ్రేడ్స్ కురుసం మంగు (పాపన్న), భద్రు (తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు), ఏగోలపు మల్లయ్య (మధు, కోటి జెఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ సభ్యుడు), ముచాకీ అందాల్ (కరుణాకర్ ఇల్లెందు నర్సంపేట్ ఏరియా కమిటీ సభ్యుడు), ముచాకీ బూమే (జమున ఏరియా కమిటీ సభ్యురాలు), పూనెం చోటు (కిశోర్, రీజినల్ కంపెనీ 2 మొదటి ప్లటూన్ పార్టీ కమిటీ సభ్యుడు), కర్ణం కామాల్ (రీజినల్ కంపెనీ2లోని రెండవ ప్లటూన్ సభ్యుడు), కా. జైసింగ్ (ఏటూర్ నాగారం మహదేవ్ పూర్ ఏరియా దళం సభ్యుడు)లు ప్రాణాలర్పించారన్నారు. ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరులకు పేరు పేరున తెలంగాణ రాష్ట్ర కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన పాశవిక హత్య కాండను తీవ్రంగా ఖండిస్తూ డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర వ్యాప్త బంద్ కు పిలుపునిస్తోందని, యావత్ పీడిత ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యాలయాలు, తదితర వ్యాపార సంస్థలు బంద్ ను పాటించి జయప్రదం చేయాలని కోరారు. ఈ ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజా ఉద్యమాలను అణిచి వేయడానికి, ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని, పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ కగార్ ను కొనసాగిస్తున్నారన్నారు.

# డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టిన కారు



**ములుగు, మహా :** ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ వద్ద గురువారం సాయంత్రం పెట్రోల్ బంక్ ఎదుట కారు డివైడర్ ను ఢీ కొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ కు చెందిన రాజమౌళికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం ములుగు వచ్చిన రాజమౌళి జంగాలపల్లి బంకులో పెట్రోల్ పోయించుకుని తిరిగి వెళుతున్న క్రమంలో జాతీయ రహదారిపై ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టింది. కారులో బెలూన్స్ ఓపెన్ అవడంతో అందులో ప్రయాణిస్తున్న రాజమౌళికి స్వల్ప గాయాలు కాగా, 108 లో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు.



# రోగులకు త్వరితగతిన సేవలందించండి: పాయం

**గుండాల, మహా:** మండలంలోని రోగులకు అత్యవసర సేవలు అందించాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గుండాల మండల పర్యటనకు వచ్చిన ఆయన గుండాలకు మంజూరైన 108, 102 అంబులెన్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గర్భిణీ, బాలింతలకు అత్యవసర సేవల కోసం మంజూరైన 102 వాహనాన్ని అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలతోపాటు 102, 108 సేవలను ప్రజలకు అందించాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి కృషి తహశీల్దార్ ఇమ్మానియేల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ మనీష్ రెడ్డి, అంబులెన్స్ జిల్లా కోఆర్డినేటర్ ప్రణయ్, గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి పాల్గొన్నారు.



# యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రమేష్ ఎన్నిక

**అశ్వారావుపేట/దమ్మపేట, డిసెంబర్ 5, మహా:** దమ్మపేట యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కాక రమేష్ మండల అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు. ఈ విజయానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం తనకు మరింత బాధ్యతను అందించిందనినారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానంటూ రమేష్ పేర్కొన్నారు.



# అమెరికా-చైనా టెక్ వార్

## ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం

### సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు

### చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు

### ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు

**వాషింగ్టన్/బీజింగ్ :** అమెరికాచైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్‌ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

**చైనా ప్రతీకార చర్యలు**

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమొని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలాచాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలాచాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికాచైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడినట్టైంది. అంతకుముందు అమెరికా.. కొత్త తరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది.

## ట్రంప్ రాకముందే..


అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దెనెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారితీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా-చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు.

## భారత్‌కు లాభమేనా?

అమెరికా-చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా-చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

# వరుస లాభాల్లో మార్కెట్లు..

## 800 పాయింట్లకుపైగా పెరిగిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల బాట పట్టాయి. గురువారం వరుసగా ఐదో సెషన్‌లో సూచీలు లాభాల్లో ముగిశాయి. త్వరలో ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశం జరుగనున్న విషయం తెలిసిందే. వడ్డీ రేట్లపై కోత విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో మార్కెట్లలో ఉత్సాహం నింపినట్లయ్యింది. దానికి తోడు ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలతో పాటు విదేశీ మదుపరులు కొనుగోళ్లకు దిగడంతో సూచీలు పెరిగాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,182.74 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,467.37 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 82,317.74 పాయింట్ల మార్క్‌ని తాకింది. చివరకు 809.53 పాయింట్లు పెరిగి.. 81,765.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 240.95 పాయింట్లు పెరిగి 24,708.40 స్థిరపడింది. దాదాపు 2,050 షేర్లు పెరగ్గా.. 1758 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టైటాన్ కంపెనీ, ట్రెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ అత్యధికంగా లాభపడ్డాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎన్‌టీపీసీ, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నష్టపోయాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండెక్స్ 2శాతం పెరగ్గా.. రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి.

# కొనసాగుతున్న రుపీ పతనం




**ముంబై, డిసెంబర్ 4:** దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కని ష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుపీడాలర్ రేటు 64.6584.76 స్థాయిలో కదలాడింది.

### యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



# అడిలైడ్ టెస్ట్‌కు ఎలాంటి పిచ్ తయారు చేస్తున్నారంటే..?

## పింక్ బాల్ టెస్ట్‌లో పైచేయి ఎవరిది..?

బోర్డర్ గవాస్కర్ టెస్ సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్ అడిలైడ్ వేదికగా జరుగనున్నది. ఈ డేనైట్ మ్యాచ్‌లో గులాబీ బంతితో ఆస్ట్రేలియాతో టీమిండియా తలపడనున్నది. ఈ మ్యాచ్‌లో త్వరగా పాతబడకుండా ఉండేందుకు పిచ్‌పై ఆరు మిల్లీమీటర్ల గడ్డిని అలాగే ఉంచనున్నట్లు మ్యాచ్‌కు ముందు అడిలైడ్ ఓవల్ పిచ్ క్యూరేటర్ డామియన్ హాఫ్ చెప్పారు. పెర్త్‌లో టీమిండియా రికార్డు స్థాయిలో 295 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్రస్తుతం సిరీస్‌లో 10 ఆధిక్యంలో భారత్ ఆధిక్యంలో ఉన్నది. రెండో టెస్ట్‌లో స్పిన్ బౌలింగ్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. పిచ్‌పై గడ్డి ఉండడంతో ఆరంభంలో ఫాస్ట్ బౌలర్లకు సహకరించే అవకాశం ఉంది. మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లు సహకరిస్తుందని క్యూరేటర్ డామియన్ పేర్కొన్నారు. బంతి పాతబడుతున్న కొద్దీ బ్యాట్స్‌మన్ దాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు క్యూరేటర్ చెప్పుకొచ్చారు. పెర్త్ టెస్టులో స్పిన్నర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారని.. అడిలైడ్ ఓవల్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుందని చెప్పారు. అడిలైడ్‌లో స్పిన్ కీలకపాత్ర పోషిస్తుందని.. మ్యాచ్‌లో స్పెషలిస్ట్ స్పిన్నర్‌ని తుదిజట్టులో తీసుకోవాలన్నారు. మ్యాచ్‌లో ఇరు జట్లు రాణించడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఫాస్ట్ బౌలర్లతో పాటు రాత్రి సెషన్‌లో స్పిన్ కీలకపాత్ర పోషించేలా బ్యాలెన్స్‌ను సరి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 2020లో ఇదే మైదానంలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 36 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో టీమిండియాకు ఇదే తొలి పింక్ బాల్ టెస్ట్. అయితే, పిచ్‌లో ఎలాంటి లోపం లేదని హాఫ్ చెప్పుకొచ్చారు.

**ఆస్ట్రేలియా జట్టు..**

పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లాబుషాగ్నే, నాథన్ లియోన్, మిచెల్ మార్ష్, నాథన్ మెక్‌స్వీనీ, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్.

**భారత్ జట్టు..**

రోహిత్ శర్మ (కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్.

# కోహ్లీ ఫిట్‌నెస్ సీక్రెట్ బయటపెట్టిన అనుష్క..

## ఆ మూడింటికే అధిక ప్రాధాన్యం



స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌కి అధిక ప్రాధాన్యం ఇస్తాడన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రపంచంలోని ఫిట్టెస్ట్ క్రికెటర్ ఎవరు? అని అడిగితే.. కోహ్లీ అని ఎవరైనా ఠక్కున చెప్పేస్తారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. నిరంతరం కష్టపడుతూ తన శరీరాన్ని దృఢంగా ఉంచుకుంటాడు. ఆటతో పాటు ఫిట్‌నెస్‌తో విరాట్ కోట్లాది మంది అభిమానుల మనసు గెలిచాడు. ఫిట్‌నెస్‌లో భారత క్రికెట్ జట్టు సభ్యులందరూ విరాట్‌ను స్ఫూర్తిగా తీసుకుంటారు. వ్యాయామం, డైట్‌కు అంతలా ప్రాధాన్యమిస్తాడు ఈ స్టార్ బ్యాట్స్‌మెన్. అయితే, కోహ్లీ ఫిట్‌నెస్ వెనుక ఉన్న రహస్యాన్ని ఆయన సతీమణి, స్టార్ నటి అనుష్క శర్మ తాజాగా బయటపెట్టారు. కోహ్లీ మూడింటికే అధిక ప్రాధాన్యత ఇస్తారని చెప్పుకొచ్చారు. ఫిట్‌నెస్, ఆహారం విషయంలో క్రమశిక్షణతో ఉంటారని తెలిపారు. రోజూ ఉదయం లేవగానే కార్డియో వర్కవుట్స్ చేస్తారని వెల్లడించారు. తనతో క్రికెట్ కూడా ప్రాక్టీస్ చేస్తారని అనుష్క చెప్పుకొచ్చారు. ఇక ఆహారం విషయానికి వస్తే.. జంక్ ఫుడ్ అస్సలు తినరని, కూల్ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉంటారని స్పష్టం చేశారు. కోహ్లీ దాదాపు 10 ఏళ్లుగా బటర్ చికెన్ తినలేదని అనుష్క చెప్పుకొచ్చారు. ఇక కోహ్లీ నిద్రకు కూడా తగిన ప్రాధానత్య ఇస్తారని తెలిపారు. నిద్ర విషయంలో అస్సలు రాజీపడరని చెప్పారు. దాదాపు ఎనిమిది గంటలపాటు ప్రశాంతంగా నిద్రపోతారని వివరించారు. మంచి నిద్రతో తగిన విశ్రాంతి పొందుతాడని అనుష్క తెలిపారు.



# ప్రీక్వార్టర్స్‌లో ప్రియాంశు, తన్వి

**గువాహటి:** గువాహటి మాస్టర్స్ టోర్నీలో టాప్ సీడ్ ప్లేయర్లు ప్రియాంశు రజావత్, తన్విశర్మ ప్రికార్వర్ట్స్‌లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో ప్రియాంశు 2220, 2114తో ఆర్యపై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో తన్విశర్మ 2118, 2114తో తాన్య హేమంత్‌పై గెలిచి ముందంజ వేసింది. శ్రియాంశి వలిశెట్టి 2119, 2114తో ఉన్నతి హుడాపై గెలిచింది.

# ఛాంపియన్స్ ట్రోఫీపై పీసీబీ డిమాండ్లు..!

## పాక్‌కు ధీటైన జవాబిచ్చిన బీసీసీఐ..!



వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉన్నది. ఈ టోర్నీపై ఇంకా ప్రతిష్టంభన నెలకొన్నది. పీసీబీ, బీసీసీఐ మధ్య ఈ జరుగుతున్న చర్చలు ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. పాక్‌కు టీమిండియాను పంపేది లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాలని చెప్పింది. అయితే, హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు అంగీకరించిన పాక్.. ఐసీసీ ఎదుట పలు డిమాండ్లను పెట్టింది. భారత్‌లో భవిష్యత్‌లో జరుగబోయే టోర్నీల్లో ఆడేందుకు తాము కూడా వెళ్లమని.. హైబ్రిడ్ మోడల్‌లోనే నిర్వహించాలని పట్టుబడుతున్నది. పాక్ డిమాండ్లను భారత క్రికెట్ బోర్డు తిరస్కరించింది. భద్రతా కారణాల దృష్ట్యా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును పాక్‌కు పంపేందుకు నిరాకరిస్తున్నట్లు చెప్పింది. దేశంలో భద్రతాపరమైన ముప్పు లేనందున భారత్‌లో జరిగే ఐసీసీ ఈవెంట్స్‌కి హైబ్రిడ్ మోడల్‌ని అంగీకరించేది లేదంటూ పీసీబీ డిమాండ్‌ను బీసీసీఐ తోసిపుచ్చింది. ఈ విషయంలో ఐసీసీకి బీసీసీఐ స్పష్టమైన సందేశం పంపిందని టెలిగ్రాఫ్‌కు సంబంధిత వర్గాలు తెలిపాయి. దాంతో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ వ్యవహారం ప్రస్తుతం ఐసీసీకి తలనొప్పి వ్యవహారంగా మారింది. రాబోయే కాలంలో భారత్ పలు ఐసీసీ టోర్నీలకు ఆతిథ్యం ఇవ్వబోతున్నది. శ్రీలంకతో కలిసి మహిళల వన్డే ప్రపంచకప్ 2025, 2026లో టీ20 వరల్డ్ కప్‌కి ఆతిథ్యం ఇవ్వనున్నది. 2029 ఛాంపియన్స్ ట్రోఫీ, 2031 వన్డే ప్రపంచకప్ భారత్‌లోనే జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రస్తుత సంక్షోభానికి ముగింపు పలికేందుకు సామరస్యపూర్వకమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు సంబంధిత పక్షాలన్నీ పేర్కొన్నాయి. త్వరలోనే ఐసీసీతో బీసీసీఐ బోర్డ్ సమావేశం కానుందని ఓ నివేదిక పేర్కొంది.



# ఐదేళ్ల తర్వాత బాలీవుడ్‌లోకి..

గ్లోబల్‌స్టార్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉంది. 'ది స్కై ఈజ్ పింక్' (2019) తర్వాత ఆమె మరే హిందీ సినిమాలో నటించలేదు. ప్రియాంకచోప్రా ఇక పూర్తిగా బాలీవుడ్‌కు దూరం కానుందనే వార్తలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో ఓ హాలీవుడ్ పత్రికకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో హిందీ చిత్రసీమలోకి పునరాగమనంపై ప్రియాంక చోప్రా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'వచ్చే ఏడాది తప్పకుండా బాలీవుడ్ సినిమా చేయబోతున్నా. ఖాళీ సమయాల్లో ముంబయికి విచ్చేసి ఇక్కడి దర్శకుల స్క్రిప్ట్స్ వింటున్నా. మంచి కథతో హిందీ ప్రేక్షకుల్ని పలకరిస్తా' అని ప్రియాంకచోప్రా పేర్కొంది. ఇదిలా వుండగా ప్రియాంకచోప్రా, అలియాభట్, కత్రినాకైఫ్ ప్రధాన పాత్రల్లో ఫరాన్‌అక్తర్ దర్శకత్వంలో 'జీలే జరా..' చిత్రం మూడేళ్ల క్రితం మొదలై మధ్యలో ఆగిపోయింది. ప్రియాంక చోప్రా హాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉండటం వల్ల డేట్స్ ఇష్యూస్‌తో ఆ సినిమా ఆగిపోయిందని బాలీవుడ్‌లో ప్రచారం జరిగింది. ఈ వార్తలపై ప్రియాంకచోప్రా స్పందిస్తూ 'వాటిలో ఏమాత్రం నిజం లేదు. ఆ సినిమా ఎందుకు ఆగిపోయిందో మీరు నిర్మాణ సంస్థను అడిగితే బాగుంటుంది' అని సమాధానమిచ్చింది. దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రియాంకచోప్రా బాలీవుడ్ సినిమా సన్నాహాల్లో ఉండటం ఆసక్తికరంగా మారింది.



# విజయ్ దేవరకొండ జటాయు?



తెలుగు ఇండస్ట్రీలో విజయ్ దేవరకొండకు ఉన్న క్రేజే వేరు. జయాపజయాలతో సంబంధం లేకుండా యువతలో తిరుగులేని ఫాలోయింగ్ ఆయన సొంతం. ప్రస్తుతం రెండు భారీ సినిమాలతో బిజీగా ఉన్నారు విజయ్ దేవరకొండ. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో విజయ్ దేవరకొండ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఇక రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న సినిమా పీరియాడిక్ కథతో రూపొందుతోంది. ఇదిలావుండగా విజయ్ దేవరకొండ తదుపరి సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త వినిపిస్తున్నది. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ఆయన ఓ సినిమాలో నటించనున్నారని సమాచారం. గతంలో మోహనకృష్ణ ఇంద్రగంటి 'జటాయు' పేరుతో ఓ వైవిధ్యమైన కథను విజయ్ దేవరకొండకు వినిపించారని, ఇప్పుడు ఆ కథకు ఆయన ఓకే చెప్పారని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పాత్ర వినూత్నరీతిలో ఉంటుందని చెబుతున్నారు. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# డౌట్ ఎందుకు..? నేను ఆ బ్యాచ్ కాదు..

## నెటిజన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన నిధి అగర్వాల్

బాలీవుడ్ నుంచి చాలా మంది హీరోయిన్స్ టాలీవుడ్ లో సినిమాలు చేసిన విషయం తెలిసిందే.. అలా వచ్చిన వారిలో నిధి అగార్వల్ ఒకరు. బాలీవుడ్ లో మున్నా మైఖేల్ అనే సినిమాలో నటించింది ఈ అమ్మడు. ఆతర్వాత 2018లో వచ్చిన సవ్యసాచి సినిమాతో తెలుగులోకి అడుగుపపెట్టింది. అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య నటించిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఆతర్వాత నాగచైతన్య తమ్ముడు అఖిల్ తో కలిసి సినిమా చేసింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో మిస్టర్ మజ్ను సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా నిరాశపరిచింది. ఇక 2019లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నిధి తన అందాలతో ఆకట్టుకుంది. ఈ సినిమాలో తన నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకుంది ఈ అమ్మడు. ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత ఈ చిన్నదనికి వరుస అవకాశాలు వచ్చాయి. అలాగే తమిళ్ లోనూ అవకాశాలు అందుకుంది. తమిళ్ లో శింబు, జయం రవి సరసన సినిమాలు చేసింది ఈ అమ్మడు. అలాగే మహేష్ బాబు మేనల్లుడు అశోక్ సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలో అవకాశం అందుకుంది. హరిహరవీరమల్లు సినిమాలో ఈ ముద్దుగుమ్మ నటిస్తుంది. ఇదిలాఉంటే తాజాగా నిధి అగర్వాల్ నెటిజన్ కు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. సోషల్ మీడియాలో నెటిజన్స్ తో మాట్లాడింది ఈ అమ్మడు. నెటిజన్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలోనే 'మీకు తెలుగు వచ్చా మేడమ్?' అని ఓ నెటిజన్ అడగ్గా దానికి నిధి అగర్వాల్ ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నాకు తెలుగు వస్తుందండీ.. ఎందుకు మీకు ఆ డౌట్ ? 'అందరికీ నమస్కారం' అని చెప్పే బ్యాచ్ కాదు నేను' అనిచెప్పకొచ్చింది నిధి అగర్వాల్. అలాగే ప్రభాస్ రాజా సాబ్ సినిమా సెట్ లో ఫన్నీ మూమెంట్స్ ఉన్నాయి అని తెలిపింది. అలాగే పవన్ కళ్యాణ్ గురించి చెప్పండి అంటే.."చాలా మంచి వారు. ఆయన ఓ లెజెండ్, పవర్‌ఫుల్ కళ్లు.. ఇలా ఆయన గురించి చాలా చెప్పొచ్చు. ఒక్క మాటలో అంటే కష్టం" అని తెలిపింది నిధిఅగార్వల్.

# షూటింగ్ సెట్‌కు వెళ్లి మరీ..

## సల్మాన్‌కు మరోసారి బెదిరింపులు




బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌కు హత్య బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా మరోసారి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. బుధవారం రాత్రి షూటింగ్ సెట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి సల్మాన్ బాడీగార్డ్‌తో లారెన్స్ బిష్ణోయ్ పేరును ప్రస్తావిస్తూ బెదిరింపు ధోరణితో మాట్లాడినట్లు గురువారం పోలీసులు తెలిపారు. సల్మాన్ ఖాన్ బుధవారం రాత్రి శివాజీ పార్క్ ప్రాంతంలో షూటింగ్ సెట్‌లో ఉండగా.. ఓ వ్యక్తి సెట్‌లోకి ప్రవేశించినట్లు పోలీసులు చెప్పారు. జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ పేరును ప్రస్తావిస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. అప్రమత్తమైన షూటింగ్‌లో ఉన్న సిబ్బంది సదరు వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం శివాజీ పార్క్ పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. కాగా, కృష్ణ జింకలను వేటాడిన కేసులో సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ గ్యాంగ్ నుంచి వరుస బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే.



## బర్త్ డే స్పెషల్..

# డీజే టిల్లు భామ టైసన్ నాయుడు లుక్ వైరల్

టాలీవుడ్ యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ చిత్రాల్లో ఒకటి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న టైసన్ నాయుడు. భీమ్లానాయక్ ఫేం సాగర్ కే చంద్ర దర్శకత్వం వహిస్తున్నాడు. డీజే టిల్లు భామ నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా బర్త్ డే సందర్భంగా విషెస్ తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు మేకర్స్. సూపర్ కూల్ గ్లామరస్ లుక్‌లో మెరిసిపోతున్న స్టిల్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 14 రీల్స్ బ్యానర్‌పై రామ్ ఆచంట-గోపి ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టైసన్ నాయుడు టైటిల్, ఫస్ట్ లుక్, గ్లింప్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. యాక్షన్ ప్యాక్‌డ్ గ్లింప్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో బెల్లంకొండ డీఎస్పీగా కనిపించబోతున్నట్టు గ్లింప్స్ హింట్ ఇచ్చేసింది. బెల్లంకొండ పోలీసాఫీసర్‌గా నటించిన రాక్షసుడు సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్‌గా నిలిచింది. ఇప్పుడు మరోసారి ఖాకీ చొక్కా వేసుకోబోతుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.



# వెడ్డింగ్‌లో పుష్ప యాక్టర్ ఫహద్ ఫాసిల్..



టాలీవుడ్‌తోపాటు పాన్ ఇండియా స్టార్ డమ్ ఉన్న మాలీవుడ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ టాలెంటెడ్ యాక్టర్ సినిమా సినిమాకు కొత్త కొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకొస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటాడని తెలిసిందే. లేటెస్ట్‌గా పుష్ప 2 ది రూల్‌లో భన్వర్ సింగ్ షెకావత్ పాత్రలో మరోసారి సిల్వర్ స్క్రీన్‌ను షేక్ చేస్తున్నాడు. ప్రొఫెషనల్‌గా ఫుల్ బిజీగా ఉన్న ఫహద్ ఫాసిల్ సెలబ్రేషన్స్ మూడ్‌లోకి వెళ్లిపోయాడు. తాజాగా వెడ్డింగ్ ఈవెంట్‌లో సందడి చేశాడు. ఇంతకీ పెళ్లి ఎవరిదేనే కదా మీ డౌటు. ఫహద్ ఫాసిల్ సతీమణి, నటి నజ్రియా నజీమ్ సోదరుడిది. వెడ్డింగ్‌లో వధూవరులతో ఫహద్ ఫాసిల్‌నజ్రియా కలిసి దిగిన స్టిల్ ఒకటి నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఫహద్ ఫాసిల్ ప్రస్తుతం మలయాళంలో రెండు తమిళం, తెలుగు భాషల్లో ఒక్కో సినిమాలో నటిస్తున్నాడు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com